# చైతన్యం

రు. 20/-

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

సెప్టెంబరు 2025



మూడు శక్తులు కూడ ముచ్చటౌ చిత్రమ్ము


వైట్ హౌస్ లో యూరోప్ దేశాల నేతలు


బ్రిక్స్ దేశాధినేతలు




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సెప్టెంబరు 2025

సంపుటి -14 సంచిక - 12



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| వార్తా విశేషాలు | 8 |
| మన భాషను మనమే పట్టించుకోవటల్లేదా | 19 |
| గురుశిష్య పరంపర | 21 |
| కాశీమజిలీ కథలు | 22 |
| క్రాంతివీరుడు శ్యామ్ జీ కృష్ణవర్మ | 25 |
| షడ్దర్శనాలు | 27 |
| మహాభారతంలో అభిమన్యుడు | 29 |
| బ్రహ్మ ఖండం | 32 |
| జ్ఞాపకాల దొంతరలో | 34 |
| కలియుగ ప్రత్యక్ష దైవం | 36 |
| అంతర్వేది | 37 |
| చైతన్యరూపిణియే అమ్మ | 40 |
| విద్యానుబంధం | 42 |
| జర్నలిస్టులకు పెన్షన్ డిమాండ్ | 45 |
| గజేంద్రమోక్షము | 47 |
| శ్రీకారం 2050 | 48 |
| మధురస్వప్నం | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

పాఠక దేవుళ్ళకు వినాయక చవితి శుభాకాంక్షలు.

వినాయక చవితి: భారతీయుల అతి ముఖ్యమైన పండుగలలో ఇది ఒక పండుగ. పార్వతీ, పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టినరోజునే వినాయక చవితిగా జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా అందరినీ ఒక్కటి చేసే సంకల్పంతో ఇప్పుడు నిరంతరంగా సాగుతున్న గణపతి ఉత్సవాలు చాలా ప్రధానమైనవి. నవ రాత్రులలో భక్తి లోపించకుండా ప్రజలంతా సన్నిహితంగా ఉండి, నవరాత్రులలో భక్తి లోపించకుండా, ప్రజలందరూ కలిసి మెలిసి ఈ పూజలు చేసుకోవాలని, ప్రజలందరికీ వినాయకుని ఆశీస్సులు ఉండాలని కోరుకుందామా!

ఉపాధ్యాయ దినోత్సవం : గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః

ఆది యుగం నుంచి ఆధునిక యుగం వరకు ఆయనే ఋషి.. జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు.. సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు.. ఆయనెవరో కాదు మనందరికీ విద్యాబుద్ధులు నేర్పే గురువు. అందుకే మన సమాజంలో అమ్మానా-న్నల తర్వాత స్థానం గురువులకు ఇచ్చారు. శిశువును లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువైతే.. గుండెలపై తన్నుతూ ఆటలాడే శిశువుకు నడక నేర్పే నాన్న రెండో గురువు. ఆ తర్వాత ఈ లోకంలో ఎలా నడుచుకోవాలో నేర్పి, విద్యా బుద్ధులు అందించే ఉపాధ్యాయుడు మూడో గురువు.

అందుకే పెద్దలు మాతృదేవోభవ.. పితృదేవో భవ.. ఆచార్య దేవోభవ అన్నారు.భారతదే-శంలో ఆనాడు ఉన్న మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్విక స్థాయికి తీసుకెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సెప్టెంబర్ 5. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆయన జన్మదినాన్ని జరుపుకుంటాం. మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులు గా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిది. అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెం-బర్ 5వ తేదీన భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాము. ఆరోజు సెలవుదినం కాదు. ఉత్సవం జరుపుకోవాల్సిన రోజు. పాఠశాలలు యథావిధిగా జరిగి, ఉత్సవాలు జరుపుకుంటాయి. ఆ రోజున ఉపాధ్యాయులకు జాతీయ, రాష్ట్రీయ, జిల్లా స్థాయిలలో పురస్కారాలు, గౌరవసత్కారాలు జరుగుతాయి. దేశమంతా తమ తమ గు-రువులను ఉపన్యాసాలతో, గౌరవ సత్కారాలతో ఆనందపరచి, శిష్యులంతా ఆశీస్సులు పొందుతారు. ఎంత అత్యున్నత పదవి పొందినా శిష్యునకు గురువు ఎప్పుడూ ఆరాధ్య దైవమే.

భారత్ --జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా టోక్యోలో మోడీ పర్యటన

భారత్ -- జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా టోక్యోలో పర్యటిస్తున్న ప్రధాని

మోదీ ప్రముఖులతో వరుసగా భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఓ ఆలయ పూజారి ప్రధాని మోదీకి 'దరూమా డాల్' ను కానుకగా అందించడం ఆకర్షణగా నిలిచింది. జపాన్ సాంప్రదాయంలో అదృష్టం, పట్టుదలకు చిహ్నంగా భావించే ఈ బొమ్మను ఇరు దేశాల మధ్య సహృద్భావానికి ప్రతీకగా అందించినట్లు సమాచారం.

ట్రంప్ కు భారీ ఎదురు దెబ్బ -- టారిఫ్ లు చట్ట విరుద్ధం- యుఎస్ కోర్టు తీర్పు

ట్రాంప్ విధించిన సుంకాలు చాలావరకు చట్ట విరుద్ధమని అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు నిచ్చింది. ట్రంప్ తన ఆర్థిక అధికారాలను అతిక్రమించి అధికంగా టారిఫ్ లను విధించినట్లు పేర్కొంది. 7-4 తేడాతో అప్పీల్ కోర్టు న్యాయమూర్తులు ఈ నిర్ణయం వెలువరించారు. భారీగా విధించిన సుంకాలు హాని చేశాయని కోర్టు పేర్కొంది. ప్రస్తుతాని-కి ఆ టారిఫ్ లను అక్టోబర్ మధ్య నాటికి కొనసాగించడానికి న్యాయమూర్తులు అనుమతి ఇచ్చారు.

అమెరికా సుంకాల యుద్ధం --- భారత్ ఎదుర్కొనే సవాళ్లు

అమెరికా భారత్ ఉత్పత్తులపై మరో 25% అదనపు సుంకం విధించింది. ఇది అర్ధరా-త్రి 26 ఆగస్టు 2025 నుంచి అమల్లోకి రానున్నాయని అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్ మెంట్ నోటీసును జారీ చేసింది. ఇప్పటికే భారత్ దిగుమతులపై 25% సుంకాలు అమలులో ఉండగా, తాజా నిర్ణయంతో మొత్తం సుంకం 50% కు చేరింది. ఈ చర్య రష్యా నుంచి భారత్ క్రూడాయిల్ కొనుగోళ్లను లక్ష్యంగా చేసుకొని, ఉక్రెయిన్ పై రష్యా చేస్తు-న్న యుద్ధానికి భారత్ క్రూడాయిల్ కొని యుద్ధాన్ని ప్రోత్సహిస్తోందని, భారత్ కి సుంకాలు పెంచితే దిగి వస్తుందని ట్రంప్ పన్నిన పన్నాగం.

ట్రంప్ రెండోసారి అమెరికా ఎన్నికలలో యుద్ధం ఆపేస్తానని ప్రజలకు చేసిన వాగ్దానం నెరవేరుతుందని, ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తున్న విస్తృత వ్యూహంలో భాగమని విశ్లేష-కులు భావిస్తున్నారు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లపై ట్రంప్ ఆగ్రహంతో తీసుకు-న్న ఈ నిర్ణయం భారత్ అమెరికాల మధ్య ఉద్రిక్తత పెంచుతోంది. ఈ సుంకాలు... వస్త్రా-లు, ఆభరణాలు, ఉక్కు వంటి రంగాలను ప్రభావితం చేస్తున్నాయి. మోడీ ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ఈ సవాల్ ను ఎదుర్కొనేందుకు వ్యూహం సిద్ధం చేస్తున్నారు.

భారత ప్రభుత్వం ఈ సుంకాలు అనుచితం, అన్యాయం అని ఖండించింది.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి దమ్ము రవి, ఈ నిర్ణయం ఏక పక్షంగా, తర్కం లేకుండా తీసుకున్నాడని విమర్శించారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలను తీసుకుంటామని భారత్ స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ సుంకాలను ' ఆర్థిక బ్లాక్ మెయిల్ అని పేర్కొంటూ అమెరికా అనుచిత వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు ఒత్తిడి తెస్తోందని విమర్శించారు.

అహమ్మదాబాద్ లో జరిగిన బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ అమెరికా విధించినా, తట్టుకునే శక్తిని భారత్ సంపాదించిందని ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ ద్వారా దేశం బలోపేతమైందని పేర్కొన్నారు.

మోడీ ప్రభుత్వం ఈ సుంకాల సవాళ్ళను ఎదుర్కొనేందుకు బహుముఖ వ్యూహాన్ని అను-

సరిస్తోంది. ముఖ్యంగా ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ ద్వారా దేశీయ ఉత్పత్తి స్వావలంబన పెంచడంపై దృష్టి సారించింది. అమెరికా మార్కెట్టుపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు... మధ్య ప్రాచ్యం, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, దక్షిణాసియా వంటి కొత్త మార్కెట్లను అన్వేషించాలని భారత్ భావిస్తోంది.

వస్త్రాలు, ఆభరణాలు, ఆటో భాగాలూ వంటి రంగాల ఎగుమతులు 50% తగ్గవచ్చు. ఉక్కు, అల్యూమినియం వంటి రంగాల్లో 30--50% తగ్గవచ్చు. ఔషధాలు, స్మార్ట్ ఫోన్ లు, పెట్రోలియం ఉత్పత్తులపై ప్రభావం తక్కువగా ఉంటుంది.

శభాష్ మోడీ -- దెబ్బకు ట్రంప్ మటాష్

అమెరికా తనను తాను దెబ్బ తీసుకుంటోందన్న ఆర్థిక వేత్త రిచర్డ్ వోల్ఫ్. ఇండియాపై సుంకాల పెంపు అమెరికా వైఫల్యమంటున్న మేధావులు. బ్రిక్స్ దేశాలు కలిపి ప్రపంచ ఉత్పత్తిలో 35% వాటా.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం భారత్ చైనా కలయిక -- ప్రధాని మోదీ

ప్రపంచ ఆర్థిక శిరత్వం తీసుకు వచ్చేందుకు భారత్ --చైనా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పరస్పర గౌరవం, ఉభయదేశాల ప్రయోజనాలు, సున్నితత్వాల ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘ కాలిక కోణంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. జపాన్లో పర్యటన కు శుక్రవారం టోక్యో కు వెళ్లిన మోదీ 'యొ మియురి' అనే వార్తా పత్రికకు ఇచ్చిన ముఖాముఖిలో ఈ విషయాలు వెల్లడించారు.

" భారత్ -చైనా మధ్య స్థిరమైన, ఊహించదగిన సామరస్య పూర్వక ద్వైపాక్షిక సంబంధాలు ఉండాలి. ఇవి ఇరుగు పొరుగున ఉన్న అతి పెద్ద దేశాలు. వీటి మధ్య సంబంధాలు బాగుంటే దాని ప్రభావం ప్రాంతీయంగానే కాక, ప్రపంచ వ్యాప్త శాంతి, సుసంపన్నతలపై పడుతుంది. అభివృద్ధిపరమైన సవాళ్ళను ఎదుర్కొనేందుకు, భిన్న ధ్రువ ప్రపంచానికి ఇదెంతో కీలకం చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో గతేడాది భేటీ అయిన తర్వాత నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాల్లో నిలకడైనపురోగతి కనిపిస్తోంది అన్నారు.

జూన్ నాటికి మోడీ ప్రభుత్వం చైనా సంబంధాలను పునరుద్ధరణ దిశగా సీరియస్ గా పరిగణించడం ప్రారంభించింది. ఈ వారం జరిగే షాంఘాయి కోపరేషన్స ఆర్గనైజషన్ SCO శిఖరాగ్రం ఉంది. ఇది మోడీ 7 సంవత్సరాల తరువాత చైనా పర్యటన అవుతుంది. మోడీ -- జిన్ పింగ్ భేటీ కి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. . రాజకీయాలకు వ్యతిరేకంగా కలిసి పనిచేస్తామని చైనా భారత్ ను ఆహ్వానించింది. సరిహద్దు వివాదాలపై చర్చలు మళ్ళీ ప్రారంభించేందుకు అంగీకారం.

అమెరికా విధించే సుంకాల ధర్మమా ! అని రెండు దేశాలు కలిసినా మన దేశం మాత్రం చైనాతో అత్యంత జాగరూకతతో ఉంటుందని భావిద్దాం.

ఏది జరిగినా మన మంచికే అన్నారు పెద్దలు. గుండ్రాయిని తిప్పినట్లు తిప్పి పెత్తనం చెలాయించాలనుకునే ట్రంప్ కి నువ్వు గుండ్రాయిని తిప్పినట్లు తిప్పుతూ నువ్వు కూడా తిరుగు, రిమోట్ మా చేతుల్లో ఉంది. మేము తిరుగుతామో, నువ్వే తిరుగు-

తావో  చూసుకోమంటోంది భారత ప్రభుత్వం. నీదే కాదు బిజినెస్ మైండ్, ఇక్కడ ఉన్నది గుజరాతీ తెలుసా? అంటున్నారు భారత ప్రధాని. అమెరికా కాకపోతే రష్యా, చైనా మిగిలిన దేశాలు .. నేనున్నాను మిత్రమా! మనం ఎప్పటికీ మిత్రులమే అంటూ  హగ్ చేసుకుని, ఆయిల్ పై ఇంకా 5% డిస్కౌంట్ ఇస్తానని చెప్పిండంతో ట్రంప్ పరిస్థితి చూడాలి. అలాగే చైనా కూడా ముందుకొచ్చింది. దగ్గర దగ్గర 100 దేశాల వరకూ మనతో వాణిజ్య ఒప్పందా-లకు సిద్ధమౌతున్నాయి.

పుతిన్ తో భేటీ --- ప్రధాని మోడీకి జిలెన్ స్కీ ఫోన్

షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లిన ప్రధాని మోదీ ... షీ జిన్ పింగ్, పుతిన్ సహా పలువురు కీలక నేతలతో భేటీ కానున్నారు. ఈ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జిలెన్ స్కీ ప్రధాని నరేంద్ర మోడీతో ఫోన్ లో సంభాషించారు. ఉక్రెయిన్ కు సంబంధించి తాజా పరిణామాలను జిలెన్ స్కీ పిఎంఓ వెల్లడించింది.

ఈ సందర్భంగా శాంతియుత మార్గాల్లో సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలన్న భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేసిన మోదీ. శాంతి పునరుద్ధరణ ప్రయత్నాలకు తమ మద్ద-త్తు ఉంటుందని, భారత్ -- ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇరుదేశాల నేతలు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది.

ఇదే సమయంలో ఉక్రెయిన్ -- రష్యా మధ్య శాంతి కి మోదీ ప్రయత్నాలు జరుపు-తున్నారా? ఇరు దేశాల మధ్య యుద్ధం నిలిపివేస్తానన్న ట్రంప్  వాగ్దానాన్ని, మోదీ సవాల్ గా తీసుకుని ,యుద్ధం నిలిచిపోయేలా చేసే  అవకాశాలు ఉన్నాయని తలుద్దామా! ఇరు దేశాలమధ్య శాంతిని నెలకొల్పడంతో ప్రపంచదేశాలన్నీ మోదీకే బ్రహ్మరథం పట్టి, నోబెల్ బహుమతి ఇస్తే .. ట్రంప్ ?

ఇక్కడ వినడానికి చూడడానికి అంతా బానే ఉంది, కానీ మన భారతీయులంతా సింధూర్ ఆపరేషన్ లో ఒక్క  తాటి మీద నడిచినట్లు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారతీ-యులంతా మన వాణిజ్య మార్కెట్టును ఏ విధంగా వృద్ధి చేసుకోవాలో చక్కటి వ్యూహంతో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కష్ట కాలంలో మనమంతా మన దేశ అభివృద్ధికి ప్రభుత్వాలకు అండగా నిలబడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మన దేశంలో ఉన్న తెలివైన మేధావులంతా చాల వరకు విదేశాలకు తమ మేధా సంప-త్తిని పెట్టుబడిగా పెట్టి, విదేశాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లాయి.

ఇప్పుడు మన కన్నతల్లి లాంటి భారత దేశాన్ని ప్రపంచంలోనే No.1గా నిలబెట్టేందుకు నడుంకట్టి ముందుకు రావలసిన సమయం ఆస-న్నమైంది.

సర్వేజనా సుఖినో భవంతు



తీగవరపు శాంతి

# వార్తా విశేషాలు

## భారత దేశమంతా విభిన్న రూపాల్లో ఆకట్టుకుంటున్న లంబోదరుడు సింధూర్ స్ఫూర్తితో 'బ్రహ్మోస్" విఘ్న వినాయకుడు




సికింద్రాబాద్ లోని నాచారంలో ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో బాబా నగర్ లో ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ గణనాథుడి విగ్రహం అందరిని ఆకట్టుకుంది. ఇటీవల ఆపరేషన్ సిందూర లో భారత్ ప్రయోగించిన యుద్ధ క్షిపణి బ్రహ్మోస్ పై గణనాధుణ్ని కూర్చోబెట్టి యుద్ధానికి పంపుతున్నట్లు రూపొందించిన ఈ వినూత్న విగ్రహాన్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు.

## ఆసియాలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో

విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడింది. విశాఖలో 6 బిలియన్ డాలర్లతో డేటా సెంటర్ ఏర్పాటును ధృవీకరిస్తూ ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్ లో పోస్ట్ చేసింది. దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కూడా నిర్ధారించింది. ఒక గిగావాట్ సామర్ధ్యంతో ఆసియాలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో నిర్మాణం కానుంది. గ్రీన్ ఎనర్జీ వినియోగంతో గేమ్ ఛేంజర్ గా నిలవనుంది . మూడు సముద్రపు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ద్వారా విశాఖలో ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. ముంబయికి రెండు రెట్ల సామర్ధ్యంతో రూపుదిద్దుకోనుంది. హైదరాబాద్ లోని హైటెక్ సిటీ తరహాలో విశాఖలోని మధురవాడ దగ్గర 500 ఎకరాల్లో డేటా సిటీని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



# భారత్ --జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో  భాగంగా టోక్యోలో మోడీ పర్యటన

భారత్ -- జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో  భాగంగా టోక్యోలో  పర్యటిస్తున్న ప్రధాని మోదీ ప్రముఖులతో వరుసగా భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఆలయ  పూజారి మోడీకి దరూమా  డాల్ ను కానుకగా అందివివాదం  ఆకర్షణీయంగా నిలిచింది .



జపాన్ సాంప్రదాయంలో అదృష్టం, పట్టుదలకు చిహ్నంగా భావించే  ఈ బొమ్మను ఇరు దేశాల మధ్య సహృద్భావానికి  ప్రతీకగా అందిచినట్లు.   గుండతి ఆకారంలో ఉండే ఈ ప్రతిమ ప్రకాశవంతమైన రంగులో ఉంటుంది. చాన్ బౌద్ధమత స్థాపకుడిగా  పేర్కొనే బోధిధర్మ ఆధారంగా దీన్ని రూపొందించినట్లు చెబుతారు. దాన్ని నెట్టినా నిటారుగా నిలబడటం  దీని లక్షణం. ఇందుకు  అనువైన బరువులో దీన్ని రూపొందిస్తారు. ఏడుసార్లు కిందపడినా ఎనిమిదోసారి లేచి నిలబడాలని  అర్థం  వచ్చే ఓ జాపనీస ాసామెతను ప్రతిబింబిస్తుంది విశ్వసిస్తారు. లక్ష్యాలను నిర్దేశించుకోవడం, కళలను సాకారం చేసుకవాలన్న  భావనకు దీనిని  ఉపయోగిస్తారు.

ఈ ప్రతిమను కొనుగోలు చేసినప్పుడు, దాని రెండు కళ్ళు తెలుపు  రంగులోనే  వదిలేసి ఉంటాయి. కొనుగోలు చేసిన వ్యక్తి ఏదైనా కోరిక లేదా లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే  తొలుత ఆ  బొమ్మ ఎడమకన్ను నల్లటి సిరాతో నింపాలి. ఆ కోరిక లేదా లక్ష్యం  నెరవేరినప్పుడు మాత్రమే కుడికన్నును  సిరాతో నింపాలి. తద్వారా నిబద్ధత  లక్ష్య ఛేదనకు  సజీవ సాక్ష్యంగా  ఈ ప్రతిమ నిలిచినట్లుగా  భావిస్తారు. కుటుంబాలు, వ్యాపారస్థులతో  పాటు రాజకీయ నాయకులు కూడా తమ పురోగతికి చిహ్నంగా దీన్ని ఉపయోగిస్తారు.

# ట్రంప్ టారిఫ్ లు

ట్రంప్ టారిఫ్ లు రష్యా చమురు కొంటున్నందుకు కాదు -- అమితాబ్ కాంత్ వ్యాఖ్యలు

మిత్ర దేశం అని చెబుతూనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ భారత్ పై సుంకాల మోత మోగించారు. దాంతో భారత్ ఎగుమతులపై 50 శాతం సుంకాల భారం అమలవుతోంది. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ స్పందించారు. రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారు చైనా . కానీ టారిఫ్ లతో భారత్ మీద విరుచుకు పడుతున్నారు . ఈ సుంకాలు రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు కాదని , దేశ ఇంధన భద్రత, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విషయంలో ఇప్పటికీ రాజీ పడకూడదు. గతంలో ఎన్నో సందర్భాల్లో భారత్ ప్రపంచ ఒత్తిడికి లొంగిపోకుండా నిల్చుంది. ఇప్పుడు అలాగే వ్యవహరించాలి. ఇలాంటి పరిస్థితులను సంస్కరణలకు అవకాశంగా మార్చుకోవాలి అని అమితాబ్ కాంత్ సూచించారు.



## తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు -- సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులు , సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్ లో కూడా వర్ష విపరీతంగా ఉండడంతో హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక , పోలీసు శాఖను అప్రమత్తం చేశారు. అందరూ కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు , ట్రాన్స్ ఫార్మర్లు ఉంటే భక్తులకు ఎలాటి ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్కో సిబ్బందిని ఆదేశించారు. నదులు , వాగులపై ఉన్న లోతట్టు కాజ్ వేలు , కాల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలు ఉంటె రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు.



## గంటకు 14 మందిని కరుస్తున్న కుక్కలు

రాష్ట్రంలో 2024 లో 1,21,997 లక్షల మంది కుక్క కాటు బాధితులు

రాష్ట్రంలో కుక్కలా బెడద తీవ్రంగా ఉంది . దీనికి పరిష్కారం ఎప్పుడన్నా ప్రశ్న ప్రతి వారిలో ఉదయిస్తోంది. సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయించడంలో ప్రభుత్వ యంత్రాంగం సఫలీకృతం కాకపోవడంతో తెలంగాణతో పాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో వాటి సంఖ్యా పెరిగిపోయి, తీవ్ర సమస్యగా మారింది. గతేడాది గంటకు 14 మంది కుక్క కాటుకు గురయ్యారు. 13 మంది రేబిస్ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా పిల్లలు పాఠశాలకు వెడుతున్నప్పుడో ..వీధిలో ఆడుకుంటున్నప్పుడో ఎక్కువగా చిన్నపిల్లలు కుక్క కాటుకు గురౌతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 2024 లో 1, 21,997 మందిని ... ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 87, 366 మందిని కుక్కలు కరిచాయి. గత ఏడాది దేశ వ్యాప్తంగా 37 లక్షల మంది కుక్క కాటు బారిన పడ్డారు. ఢిల్లీలోనూ ఈ ఏడాది 35, 198 మంది కుక్క కాటుకు గురయ్యారు. డబ్ల్యూ హెచ్ వో లెక్కల ప్రకారం .. ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే రేబిస్ మరణాల్లో 36%భారత్ లోనివే. బాధితులంతా 15 ఎళ్లా లోపు వారే . ఢిల్లీ రోడ్లపై కుక్కలు కనిపించద్దని , వాటినన్నిటినీ సంరక్షణ కేంద్రాలకు తరలించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ సమస్యపై విచారణకు సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టడం నిషేధమని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో శునకాలపై కరుణ చూపాలంటూ జంతు ప్రేమికులు , సెలబ్రెటీలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మరికొందరు రోడ్లెక్కి నిరసనలు వ్యక్తం చేశారు.



ఇంకోవైపు శునక బాధితులు , వారి మద్దత్తు దారులు పోటీగా శునకప్రేమికుల వాదనలకు ప్రతివాదాలు చేస్తున్నారు. జంతువుల పట్ల క్రూరత్వ చట్టం --1960 ప్రకారం హానిచేసే కుక్కలకు ప్రశాంత మరణాన్ని ఇవ్వాలి . జీహెచ్ఎంసీ చట్టం అదే చెబుతున్నట్లు బల్దియా కోర్టుకు తెలిపింది.

యూకే , అమెరికా , సింగపూర్ తదితర దేశాల్లో కుక్కలను రోడ్లపై తిరగనివ్వరు . లండన్లో కుక్క వీధిలో కనిపిస్తే బంధిస్తారు. వారం రోజుల్లో ఎవరూ తీసుకెళ్లక పొతే దానికి ప్రశాంత మరణాన్ని కలిగిస్తారు . అలాగే కుక్కలా విషయంలో యజమానులు నిబంధనలు

పాటించాలి. మలమూత్ర విసర్జన రోడ్లపైన చేయకుండా జాగ్రత్త పడాలి. ఏదైనా కారణంతో వాటిని పోషించలేకపోతే , ప్రభుత్వానికి అప్పగించాలి కానీ వీధుల్లో వదలకూడదు.

## పాఠశాల పిల్లల తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDAI) పాఠశాల విద్య మరియు అక్షరాస్యత శాఖతో కలిసి ఆధార్‌కు సంబంధించిన పాఠశాల పిల్లల తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (MBU) స్థితిని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (UDISE+) అప్లికేషన్‌లో అందుబాటులో ఉంచడానికి చేతులు కలిపింది - ఇది కోట్లాది మంది విద్యార్థులకు ఆధార్‌లో MBUని అందుబాటులో ఉంచే చర్య. ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు మరియు పదిహేను సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్‌లో MBUని సకాలంలో పూర్తి చేయడం తప్పనిసరి. ఆధార్‌లో పిల్లల బయోమెట్రిక్ డేటా యొక్క ఖచ్చితత్వం మరియు విశ్వసనీయతను నిర్వహించడం చాలా ముఖ్యం. తప్పనిసరి బయోమెట్రిక్స్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్న దాదాపు 17 కోట్ల ఆధార్ నంబర్‌లు ఉన్నాయి. ఆధార్‌లో బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయడం పిల్లలకు ముఖ్యం, లేకుంటే వివిధ ప్రభుత్వ పథకాల కింద ప్రయోజనాలు పొందడం, NEET, JEE, CUET వంటి పోటీ మరియు విశ్వవిద్యాలయ పరీక్షలలో రిజిస్ట్రేషన్ కోసం ప్రామాణీకరించేటప్పుడు వారు తరువాత ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది. చాలాసార్లు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు చివరి నిమిషంలో ఆధార్‌ను అప్‌డేట్ చేయడానికి తొందరపడతారని గమనించాలి, ఇది ఆందోళనను పెంచుతుంది. సకాలంలో బయోమెట్రిక్‌లను అప్‌డేట్ చేయడం ద్వారా ఈ సమస్యను నివారించవచ్చు.




UIDAI CEO శ్రీ భువనేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఈ చొరవ గురించి తెలియజేస్తూ ఒక లేఖ రాశారు మరియు లక్ష్యంగా చేసుకున్న MBU శిబిరాలను నిర్వహించడంలో సహకరించాలని కోరారు. UIDAI CEO తన లేఖలో ఇలా రాశారు, "పాఠశాలల ద్వారా శిబిరాన్ని నిర్వహించడం పెండింగ్‌లో ఉన్న MBUని పూర్తి చేయడంలో సహాయపడుతుందని భావించారు.




ఏ విద్యార్థులు తమ బయోమెట్రిక్‌లను నవీకరించలేదో పాఠశాలలకు ఎలా తెలుస్తుంది అనేది ప్రధాన ప్రశ్న. UIDAI యొక్క సాంకేతిక బృందాలు మరియు భారత ప్రభుత్వంలోని పాఠశాల విద్య మరియు అక్షరాస్యత విభాగం కలిసి UDISE+ అప్లికేషన్ ద్వారా పరిష్కారాన్ని విజయవంతంగా అమలు చేయడానికి కలిసి పని

చేశాయి. ఇప్పుడు అన్ని పాఠశాలలు పెండింగ్‌లో ఉన్న MBUల గురించి సమాచారాన్ని పొందగలుగుతా-యి. UDISE+ గురించి ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (UDISE+) అనేది పాఠశాల విద్య మరియు అక్షరాస్యత శాఖ కింద ఉన్న విద్యా నిర్వహణ సమాచార వ్యవస్థ మరియు పాఠశాల విద్యకు సంబంధించిన వివిధ గణాంకాలను సేకరిస్తుంది. UIDAI మరియు పాఠశాల విద్యా శాఖ యొక్క ఈ ఉమ్మడి చొరవ పిల్లల బయోమెట్రిక్‌లను నవీకరించడాన్ని సులభతరం చేస్తుంనిర్వహణ సమాచార వ్యవస్థ మరియు పాఠశాల విద్యకు సంబంధించిన వివిధ గణాంకాలను సేకరిస్తుంది. UIDAI మరియు పాఠశాల విద్యా శాఖ యొక్క ఈ ఉమ్మడి చొరవ పిల్లల బయోమెట్రిక్‌లను నవీకరించడాన్ని సులభతరం చేస్తుందని భావిస్తున్నారు.

## ఫిజి ప్రధాని సితివేని లిగమమడ రబుక

న్యూఢిల్లీ: మూడు రోజుల భారత పర్యటనలో ఉన్న ఫిజి ప్రధాని సితివేని లిగమమడ రబుక, న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ప్రధానమంత్రి రబుకతో పాటు ఆయన భార్య సులుయేటి రబుక మరియు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు ఆయన ఫిజి ప్రధాని సితివేని లిగమమడ రబుక సమక్షంలో రెండు దేశాల మధ్య ఉన్నత స్థాయి ప్రతిని-ధి బృందం చర్చలు జరిగాయి. పరస్పర మరియు ప్రపంచ





ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చ జరిగింది.

# గుజరాత్, బీహార్, తెలంగాణ మరియు అస్సాంలలో కొత్త రైల్వే లైన్లకు మంత్రివర్గం ఆమోదం

నాలుగు రైల్వే ప్రాజెక్టులకు మంత్రివర్గం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. వీటి మొత్తం వ్యయం దాదాపు రూ.12,328 కోట్లు. దీని కింద, గుజరాత్‌లోని దేశల్‌పార్-హాజిపిర్-లూనా మరియు వాయోర్-లఖ్‌పత్‌లకు కొత్త రైల్వే లైన్లు, తెలంగాణలోని సికింద్రాబాద్-వాడికి మూడవ మరియు నాల్గవ రైల్వే లైన్లు, బీహార్‌లోని భాగల్పూర్-జమాల్పూర్‌కు మూడవ రైల్వే లైన్ మరియు అస్సాంలోని పుర్కేటింగ్-న్యూ టిన్సుకియాకు రైల్వే లైన్ డబ్లింగ్‌కు ఆమోదం లభించింది. గుజరాత్‌లోని కచ్‌లోని మారుమూల ప్రాంతాలను అనుసంధానించడానికి కొత్త రైల్వే లైన్ కూడా ఆమోదించబడింది. ఈ నిర్ణయం ప్రయాణీకుల మరియు సరుకు రవాణా రెండింటికీ ప్రయోజనకరంగా ఉంటుంది. కచ్‌లోని కొత్త రైల్వే లైన్ సరిహద్దులో ఉన్న రాన్ ఆఫ్ కచ్, హరప్పా సైట్ ధోలావీరా, కోటేశ్వర్ ఆలయం, నారాయణ్ సరోవర్ మరియు లఖ్‌పత్ కోటలను అనుసంధానించడం ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ ప్రాజెక్ట్ గుజరాత్‌లోని ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌కు 145 కి.మీ మార్గం మరియు 164 కి.మీ ట్రాక్‌ను జోడిస్తుంది. దీని అంచనా వ్యయం రూ.2526 కోట్లు.




## ఒక్క విద్యార్థి కూడా లేని బడుల్లో తెలంగాణకు 2 వ స్థానం

ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో తెలంగాణ దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది. పశ్చిమ బెంగాల్ 3,812 పాఠశాలలతో తొలి స్థానంలో ఉండగా, మన రాష్ట్రం 2,245 బడులతో ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2245 జీరో పాఠశాలల్లో 1,016 మంది టీచర్లు పనిచేస్తున్నారు. కాకపోతే వారు సమీప పాఠశాలలను డిప్యుటేషన్ పై వెడుతున్నారు.

## దేశంలో తొలిసారి కోటి దాటిన టీచర్ల సంఖ్య



గతంలో ఏ సంవత్సరంలోనూ ఈ స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య నమోదు కాలేదని , ఈ విద్యా సంవత్సరంలో దేశంలో ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటినట్లు కేంద్ర విద్యాశాఖ తాజా నివేదిక వెల్లడించింది.
ఈ స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య నమోదు కాలేదని , పాఠశాల విద్య చరిత్రలోనే ఇది చెప్పు- కోదగిన విషయమని పేర్కొంది . ఈ పెరుగుదల అనేది ఉపాధ్యాయ --విద్యార్థి నిష్పత్తి మెరుగుపడటం , నాణ్యమైన విద్య ,ఉపాధ్యాయుల లభ్యత విషయంలో ప్రాంతీయ అసమానతల సమస్యను పరిష్కరించడాన్ని సూచిస్తోందని పేర్కొంది. 'యూ --డైస్ ప్లస్' ( యునైటెడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ) పేరుతో దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యాసమాచారాన్ని కేంద్ర విద్యాశాఖ క్రోడీకరిస్తోంది. దీని ప్రకారం 2024 --25 విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయుల సంఖ్య 1-01 కోట్లుగా నమోదైంది. గతేడాది 98 లక్షలుండగా అంతకుముందు ఏడాది (2022 --23 లో ) 94. 8 లక్షలుగా రికార్డయ్యింది.

గత రెండేళ్లతో పోలిస్తే ప్రాథమిక, మాధ్యమిక , ఉన్నత స్థాయిలో ఈ ఏడాది డ్రాపౌట్ రేట్లలో గణనీయంగా తగ్గింది. సెకండరీ స్థాయి విద్యను అందించే పాఠశాలల సంఖ్య పెరగడం , విద్యార్థుల చదువు కొనసాగింపున దోహదం చేస్తోందని తాజా నివేదిక తెలిపింది . విద్యార్థులు నమోదుకాని పాఠశాలలతో పాటు ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్యా క్షీణిస్తోందని, ప్రభుత్వాల చిట్టా తోనే ఇది సాధ్యమౌతోందని అభిప్రాయపడింది. గతేడాదితో పోలిస్తే ఒకే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలల సంఖ్య 6 శాతం తగ్గగా .. సున్నా నమోదిత పాఠశాలల సంఖ్య 38 శాతం తగ్గడం చెప్పుకోదగ్గ పురోగతిని సూచిస్తోందని నివేదిక పేర్కొంది.

## మూసీ పరివాహక అభివృద్ధి వందేళ్ల అవసరాలకు అనుగుణంగా -- సీఎం రేవంత్ రెడ్డి

మూసీ రివర్ డెవలప్మెంట్ మాస్టర్ ప్లాన్ ను సీఎం రేవంత్ రెడ్డి కి అధికారులు వివరించారు. జూబ్లీహిల్స్లోని సీఎం నివాసంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గేట్ వే ఆఫ్ హైదరాబాద్ , గాంధీ సరోవర్ అభివృద్ధితో పాటు జంక్షన్ల ఏర్పాటు , రోడ్ల అభివృద్ధి పై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు.
సిగ్నల్ రహిత జంక్షన్లను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూసీ నది పరివాహక అభివృద్ధి జరగాలన్నా ముఖ్యమంత్రి .. గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను సీఎం పరిశీలించారు.

అభివృద్ధి అంతా పర్యావరణ రహితంగా ఉండేలా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. మీరాలం చెరువు అభివృద్ధి , ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రణాళికలను అధికారులు వివరించారు . వీలైనంత త్వరగా డీపీఆర్ సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలని అధికారులని సీఎం ఆదేశించారు.

## ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను August 26 జాతికి అంకితం



స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన నీలగిరి శ్రేణి నౌకలైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. తూర్పు నౌకాదళ కేంద్రమైన విశాఖపట్నంలోని డాక్‌యార్డులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి హాజరుకానున్నారు. వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పీ-17 పేరిట స్వీయ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధ నౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది.

## ఆదర్శ్ డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ




రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఆదర్శ్ డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ'ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ భద్రత కేవలం ప్రభుత్వం , సైన్యం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో సరిహద్దు ప్రాంతాల ప్రజలు సాయుధ దళాలకు పూర్తి మద్దతు ఇచ్చారని, ఇది దేశ భద్రత పట్ల వారి నిబద్ధతకు నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు

# EEPC దక్షిణ ప్రాంత ఎగుమతిదారుల అవార్డుల ప్రదానోత్సవం




రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తోన్న నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఈ ప్రాంతం నుంచి ఇంజనీరింగ్ ఉత్ప- త్తులు విదేశాలకు ఎగుమతి అయ్యేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడలో కేంద్ర వాణిజ్య- పరిశ్రమ మంత్రిత్వశాఖ ఆధ్వ- ర్యంలోని- ఇంజనీరింగ్ ఇంజి- నీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి- EEPC దక్షిణ ప్రాంత ఎగుమతిదారుల అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతి- థిగా పాల్గొన్నారు. 2024-25 సంవత్సరంలో దేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో ఇంజినీరింగ్ ఎగుమతులు సుమారు 26% వాటా కలిగి ఉన్నాయని మంత్రి మనోహర్ అన్నారు. 116.67 బిలియన్ వరకు చేరుకున్నాయని... ఈ ఇంజినీరింగ్ ఎగుమతుల్లో దక్షిణ రాష్ట్రాల వాటా 32శాతంగా ఉండడం అభినందనీమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహాయం, రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార వే- త్తలకు అనుకూలమైన రీతిలో ప్రోత్సాహక విధానాల ద్వారా మరింత ఎక్కువగా ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయనే ఆశాభావాన్ని మంత్రి మనోహర్ వ్యక్తం చేశారు. దేశం నుంచి ఇంజినీరింగ్ ఉత్పత్తులు, పారిశ్రామిక ప్రాజెక్టులు, సాంకేతిక కన్సల్టెన్సీ సేవల ఎగుమతులను ప్రోత్సహించడంలో EEPC చేస్తోన్న కృషిని కొనియాడారు. దక్షిణ రాష్ట్రాల నుంచి విమానాలు / హెలికాప్టర్లు విడిభాగాలు, రైల్వే కోచ్‌లు, వ్యాగన్లు, కార్లు, వాణిజ్య వాహనాలు, ఆటోమొబైల్ భాగాలు, ఉపకరణాలు, చక్కెర, సిమెంట్ యంత్రాలు... వస్త్ర మిల్లుల యంత్రాలు, విడిభాగాలు... పంపులు, విద్యుత్ శక్తి యంత్రాలు... పారిశ్రామిక కాస్టింగ్స్- వాల్వులు, విండ్‌మిల్, సౌర శక్తికి సంబంధించిన ఉత్పత్తులు ఎక్కువగా మన దేశం నుంచి అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్... ఇతర యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు... దక్షిణ భారతదేశం నుంచి ఎక్కువ ఎగుమతుల చేసిన ప్రతిభావంతులకు అవార్డులతో సత్కరించడం సంతోషదాయకమని మంత్రి మనోహర్ అన్నారు. EEPC దక్షిణ ప్రాంతం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల ఇంజినీ- రింగ్ ఎగుమతిదారులకు సేవలందిస్తోందని నిర్వాహకులు తెలిపారు. అమెరికా విధిస్తోన్న పన్నులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మకమైన ఆలోచనలు చేస్తోందని- వ్యాపార- వేత్తలు, ఎగుమతిదారులకు ఇబ్బంది లేకుండా ఇతర దేశాలకు మన ఉత్పత్తులు ఎగుమతి కానున్నాయ- న్నారు.

## తిరుపతిలో దక్షిణాది రాష్ట్రాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్- డిజిపిల సమావేశం



తిరుపతిలో దక్షిణాది రాష్ట్రాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్- డిజిపిల సమావేశం ఈ రోజు ప్రారంభమైంది. ఈ సమావేశం-లో నేరాల నియంత్రణలో రా-ష్ట్రాల సహకారం, తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. అలాగే సరిహద్దు ప్రాంతాలు, మావోయి-స్టు, నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల్లో భద్రత చర్యలపై చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా శేషాచలం అటవీ ప్రాంతంలో వృక్ష సంపదను కాపాడుతున్న విధానం, ఎర్రచందనం అక్రమ రవాణా ని-యంత్రణకు తీసుకుంటున్న చర్యలను గురించి వివరించారు. కాగా ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 57మంది పోలీసు ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

## సద్గురు ద్విచక్ర వాహనంపై 17 రోజుల కైలాస గిరి యాత్ర



మెదడుకు రెండు శస్త్ర చికిత్స-లు చేయించుకుని , కోలుకున్న సద్గురు ... తొలిసారిగా ద్విచక్ర వాహనంపై 17 రోజుల కైలాసగిరి యాత్ర చేపట్టారు. ఆయన రెం-డేళ్లుగా కైలాస యాత్ర చేపట్టారు. కైలాసాన్ని వర్ణించడానికి మాటలు చాలవని ఈశా ఫౌండేషన్ వ్యవ-స్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ పేర్కొన్నారు. తమిళనాడు నుంచి ఈ నెల 9 న నేపాల్ వెళ్లి , అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై బయ-లుదేరారు. మార్గమధ్యంలో నటుడు మాధవంతో సద్గురు మాట్లాడుతూ .. కైలాసం ఆదియోగి శివుడు పరిపూర్ణుడుగా ఉండే స్థలమని , గొప్ప జ్ఞాన ప్రదేశమని చెప్పారు.వరుణ్ చక్రవర్తి మాట్లాడుతూ .. రెండు శస్త్రచికిత్సల తరువాత చేపట్టిన కైలాస యాత్ర ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇది యో-గశక్తి అని సద్గురు సమాధానమిచ్చారు. ప్రస్తుతం సద్గురు తిరుగు ప్రయా-ణంలో ఉన్నారని ఈశా వర్గాలు వెల్లడించాయి.



## తెలుగు సాహిత్యం చాలా గొప్పది -- తెలుగును మనమే పట్టించుకోవడం లేదా ?

గతంలో ఏ సంవత్సరంలోనూ ఈ స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య నమోదు కాలేదని, ఈ విద్యా సంవత్సరంలో దేశంలో ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటినట్లు కేంద్ర విద్యాశాఖ తాజా నివేదిక వెల్లడించింది. ఈ స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య నమోదు కాలేదని, పాఠశాల విద్యా చరిత్రలోనే ఇది చెప్పుకోదగిన విషయమని పేర్కొంది. ఉపాధ్యాయుల జీతాలు, పెన్షన్లు, వారికి సదుపాయాలూ పెరగడంతో ఉపాధ్యాయుల కూడా సంఖ్య పెరిగింది. ఈ విషయం చాలా గర్వించదగ్గ విషయమే. అలాగే పాఠశాలల బిల్డింగ్ లు పిల్లలకు అన్ని సదుపాయాలు చేకూర్చేవిగా ఉండాలి. ఉపాధ్యాయుల విద్యావిధానంలో మార్పులు తీసుకు రావడమే కాక, విద్యా బోధనలో నాణ్యత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యార్థికి ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించే పాఠాలు మళ్ళీ ఇంటికి వెళ్లి చదవాల్సిన అవసరం లేనంతగా బోధిస్తే, ఆ చదువు మీద విద్యార్థికి శ్రద్ధ రావడమే కాక, ఆ ఉపాధ్యాయుడంటే కూడా గౌరవం ఏర్పడి, జీవితాంతం గుర్తుండిపోతారు.

ముఖ్యంగా మన ప్రాథమిక పాఠశాలల్లో మాతృ భాషలో విద్యా బోధన జరగాలి. వేరే భాషలు కావాలంటే




మాతృభాషతో పాటు నేర్చుకోవచ్చు. కానీ మన భాష మనకి తల్లి వంటిది అని ప్రజలు, ప్రభుత్వం గుర్తించాలి. అలాగే పాఠశాలల్లో మన సంస్కృతి, సాంప్రదాయాలు గురించి కూడా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలి. లైబ్రేరీలు ఏర్పాటు చేసి, పుస్తకాలు ఎక్కువ చదివిన వారికి తగిన బహుమతులు ఇచ్చి ప్రోత్సహించాలి. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వారిని ప్రోత్సహించాలి. జానపద గీతాలు, దేశభక్తి గీతాలు, సంగీత కార్యక్రమాలు, నాట్య కళలు వంటివి ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో వాటిపై అవగాహన పెంచాలి. తెలుగును మన తెలుగువారే పట్టించుకోవడం లేదు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా విమర్శలకు తావివ్వకుండా ప్రజలు, ప్రభుత్వం ముందుకు రావాలి. మన రాష్ట్రంలో జరిగే అన్ని విషయాలతో

పాటు, ప్రజలు దేశంలో జరుగుతున్న అన్ని విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మన రాష్ట్రంలో రోజువారీ సరుకుల ధరలు, అలాగే వాతావరణం, రాష్టంలో జరుగుతున్న రాజకీయాల గురించి ఎలాగయితే తెలుసుకుంటామో, అలాగే దేశంలోనూ, ప్రపంచంలోనూ జరుగుతున్న విషయాల గురించి కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది. దానికి మన ప్రభుత్వం కూడా సహకరించాలి. పార్లమెంటులో కూడా అన్ని రాష్ట్రాలు తమ మాతృ భాషలోనే మాట్లాడాలనే నిబంధన పెట్టాలి ప్రజలకు మాతృభాషలోనే వినే అవకాశం ఉండాలి. అప్పుడు ప్రజలకు తమ మాతృ భాషలో వినిపిస్తుంటే అర్థం చేసుకుందుకు సులువుగా ఉండి, అన్ని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం పెరుగుతుంది.

తెలుగు సాహిత్యం చాలా గొప్పది -- తెలుగును మనమే పట్టించుకోవడం లేదా ?

మన దేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాషకు ప్రాధాన్యత తగ్గిపోతోందని, విదేశాల్లోనే వాటికి ప్రాముఖ్యత పెరిగి, బాగా నేర్చుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. తెలుగు వారు రాజకీయ అధికారంలో కూడా ఎక్కువ మంది ఉండరు వ్యాపారంలో కూడా ఎక్కువ మంది ఉండరు. తెలుగువారు అని చెప్పుకుందుకు భయం తెలుగు వారికి అనేది విశ్లేషకుల వాదన. ఆ భయం పోవాలంటే మేధావులకు తెలుగు అంటే పట్టాలి. రచయితలకు కూడా విలువ లేదు అని విశ్లేషకుల అభిప్రాయం. సామాన్యుల తప్పు కాదు.తమిళ్ ప్రాచీన భాష గా అనౌన్స్ చేసిన వెంటనే ఢిల్లీ నుండి జ్ఞాన పీఠ్ అవార్డు, సంస్కృతం, హిందీ కాకుండా వెతుక్కుంటూ జాతీయ స్థాయిలో తమిళ్ కి సంవత్సరానికి ఒక అవార్డు ఇస్తున్నారు. సాహిత్య అకాడమీ వారు కూడా తమిళియన్స్ కి ప్రతీ సంవత్సరం అవార్డు ఇస్తారు. ఇంత ప్రాచీన భాష అయినా తెలుగుకి ప్రాముఖ్యత ఏది? తెలుగు భాష మీద చర్చలు ఎక్కువగా జరుగుతున్నాయి. అత్యంత ప్రాచీన కథలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో తెలుగు జానపద కథలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా తెలుగు వారు విస్తరించి ఉన్నారు. ఎక్కడ తెలుగు వారు ఉంటే, అక్కడ తెలుగు బడులు కూడా ఏర్పాటు చెయ్యాలి. ఇది ఎంతో అవసరం .

తెలుగువారు ఒక్క మన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, తెలుగు వారు వివిధ రాష్ట్రాలలో ఉన్నారు. కుల గణ లెక్కల లాగే, తాము తెలుగు వారమని నమోదు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మొత్తం అన్ని చోట్ల ఉన్న తెలుగువారి లెక్క సరిగ్గా తెలియవలసిన అవసరం ఉంది. ప్రపంచ దేశాలలో కూడా ఎంతో మంది ఉన్నారు. ప్రభుత్వంలో ఉన్న అధికారులు, మేధావులు అందరూ కలిసి మన తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషకు కృషి చేస్తే గాని మన తెలుగువారి సంపద అయిన వేదాలు, కళలు, సంస్కృతి, సాంప్రదాయాలు ఇలా ఎన్నో మనం కోల్పోయే ప్రమాదం ఉంది.

ప్రపంచంలో పలు ప్రాంతాల్లో అంతర్జాతీయ తెలుగు భాషా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి .అన్ని చోట్లా పలు వక్తలు, రచయితలు, రచయిత్రులు, మేధావులు అందరి ఆవేదన ఒకటే. తెలుగు భాషకు ఇంకా గుర్తింపు రావాలి, మరుగున పడకుండా, అందరూ తెలుగులోనే మాట్లాడాలి. తెలుగులోనే చదువుకోవాలి. గ్రంథాలయాలలో పుస్తక పఠనం అలవాటు చేయాలి. గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలి అనేది ప్రముఖుల ఆవేదన .

మన నట సామ్రాట్ ఎన్టీఆర్ వల్ల తెలుగువారంటే అందరికీ తెలిసింది. అంతకు మునుపు మనం తెలుగు వారం అంటే మద్రాసీయులు! అనే వారు. ఎంత చెప్పినా అర్థం కాని పరిస్థితి మనది.అప్పుడు. ఇప్పుడు మరల భాషకు కూడా మెల్లిగా ప్రాధాన్యత తగ్గుతోంది అని విశ్లేషకులలో భయం ఏర్పడుతోంది. కావున మన రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, మేధావులు అంతా కలిసి కృషి చేసి, మన తెలుగు భాషకు ఇంకా గుర్తింపు తీసుకు రావాలని కోరుకుందాం.

# గురు శిష్య పరంపర

వేంకట రమ సోమయాజుల

వ్యాసాయ విష్ణు రూపాయ
వ్యాస రూపాయ విష్ణవే
నమోవై బ్రహ్మ నిధయే వాశిష్ఠాయ
నమో నమః

వ్యాసుల చేత బహిర్గతమైన ఆత్మజ్ఞానాన్ని అందుకున్న ఋషులు, గురువులు ఎందరో భారత దేశాన్ని వారి పాద స్పర్శతో పునీతం చేస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, ఉపాసనలు, పూజలు, ప్రవచనాలు అందించిన ఒకేఒక్క ఋషి "వ్యాస మహర్షి".

ఒక్కసారి గతంలోకి వెళ్తే కానీ మనకున్న సంపదేమిటో మనకు అర్థం కాదు. మన గతం ఎలాగవున్నదో చూద్దాం:

క్రీస్తు పూర్వం 6000 సం.ల క్రితం భారత దేశంలో నిర్జన, నిర్మానుష్య, ఏకాంత, ప్రశాంత వాతావరణంలో ఆర్యులు నివసిస్తున్న రోజులవి. జనాభా తక్కువగా ఉండి వనరులు పుష్కలంగా ఉన్నాయి. అప్పటికి మనిషి సంఘ జీవితానికి అలవాటు పడలేదు. స్వేచ్ఛతో జీవిస్తున్నాడు. తనకంటూ ఒక ప్రత్యేకత లేకుండా ప్రకృతిలో ఒక భాగమై ఆనందంగా జీవిస్తున్న మానవుడికి ఒక "గొప్ప వెలుగు" గోచరమయ్యింది.

ప్రశాంతంగా ఉన్న సమయంలో "వేదం" బహిర్గతం అయ్యింది. అప్పటికి వేదాల యొక్క ఆవశ్యకత లేనప్పటికీ భావి తరాలకు వాటి అవసరాన్ని ఋషులు గుర్తించారు.

"వేదం" అనగా "సత్యం". ఆ సత్యాన్ని దర్శించిన ఋషులు భావి తరాలకు అందించాలని తపించారు. అప్పటికి మానవుడు ఎటువంటి భాషను వాడలేదు. వేదాన్ని వివరించడం కోసం అది దైవ సంబంధమైనది కాబట్టి అతి పవిత్రమైన దేవ భాష సంస్కృత భాష జన్మించింది. వేద వ్యాసులవారు ఈ బాషను సృష్టించి, దానికి తగ్గట్టుగా వ్యాకరణాన్ని కుడా అందించారు. భూమి మీద ఆవిర్భవించిన మొదటి భాష సంస్కృత భాష. ఈ భాషే అన్ని భాషలకు జనని.

వ్యాస మహర్షి అసలు పేరు " కృష్ణ ద్వైపాయనుడు".ముందు వేదం ఒకటిగా ఉండేది. దానిని నాలుగు భాగాలుగా విభజించినందున ఆయనకు "వేదవ్యాసుడు" అని నామకరణం జరిగింది. ఆ వేదాలను అందుకోవటానికి వీలుగా నాలుగు మహా వాక్యాలు ఇచ్చారు.

ఋగ్వేదం: ప్రజ్ఞానం బ్రహ్మ
యజుర్వేదం: అహం బ్రహ్మాస్మి
సామవేదం: తత్వమసి
అధర్వణవేదం:
అయమాత్మా బ్రహ్మ

వేదాల యొక్క సారాన్ని వేదాంతం అని అంటారు. దానిని ఉపనిషత్తుల రూపంలో అందించడం జరిగింది.

"పంచమ వేదం" అనబడే మహాభారతాన్ని కూడా ఆయనే అందించారు.

వేదాలను అవగతం చేసుకోలేని సామాన్య మానవునికి జీవిత విలువల గురించి ఇతిహాస రూపంలో దానిలో వివరించారు.

శ్రీ మద్భాగవతంతో కూడిన అష్టాదశ పురాణాలను కుడా ఆయనే రచించారు.

ఐతే వేదాలను తెలుసుకోకుండా మనం ధర్మాన్ని కానీ, సంస్కృతీ సంప్రదాయాల్ని కానీ తెలుసుకోవటం అసాధ్యం. మనం వేదాలను తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఐతే ఇది సమాజంలో ఒక వర్గానికి చెందినవారికి మాత్రమే అందాలనే అపోహ ఏర్పడింది. దానివల్ల మనం కొంత దుష్పరిణామాన్ని చవి చూడవలసి వచ్చింది.

"వేదం" అంటే " "సత్యం" కదా! అది అందరూ అందుకోవటం కష్టం అవ్వచ్చు. అసాధ్యమైతే కాదు.

చెఱకుగడనుండి రసం తీసి అందించినట్లు వేదాల యొక్క సారాన్ని అందించాలనే తపనతో

(24 వ పేజీ చూడడండి)

# కాశీమజిలీ కథలు

డా. మాదిరాజు బ్రహ్మానంద రావు




## మూడవభాగం

## వరప్రసాదుల కథ

### మణిసిద్ధుడు-కోటప్ప

కాశీమజిలీ కథలను చెప్పిన కథకుడు మణిసిద్ధుడు. ఆ కథలను విన్న శ్రోత కోటప్ప. కథకు కథ చెప్పేవాడెంత అవసరమో కథను వినేవాడు కూడా అంతే అవసరం. చెప్పేవాడుండి వినేవాడు లేకపోయినా-వినేవాడుండి చెప్పేవాడు లేకపోయినా కథ ప్రచారంలోకి రాదు. దానికి ప్రయోజనం కూడా ఉండదు. అందుకే కాశీమజిలీ కథలకు కూడా మణిసిద్ధుడు-కోటప్ప అవసరమౌతున్నారు.

రచయిత కథకునిగా ఎవరో ఒకరిని ఎంచుకోడు. లోకానుభవం, ధర్మాధర్మాలు, న్యాయాన్యాయాలు, పాపపుణ్యాల పరిజ్ఞానం కలిగిన వానిని-వివిధశాస్త్రాలు, పురాణేతిహాసాలు కరతలామలకమయిన వానిని- వివిధ దేశాచారాల విధివిధానం తెలిసి ఉన్నవానిని కథావక్తగా ఎన్నుకుంటాడు. అట్లాంటి కథావక్తకు శ్రోతలకు కలిగే అనేకానేక సందేహాలకు విసువులేకుండా వెనువెంటనే సమాధానం చెప్పగలిగే సద్యఃస్ఫూర్తి ఉండాలి. ధారణాశక్తి, చమత్కారం, హాస్యప్రియత్వం కలిగి ఉండటం వక్త నేర్పరితనాన్ని తెలియజేస్తుంది. మణిసిద్ధుడు కూడా ఇట్లాంటి లక్షణాలన్నీ ఉన్న-




వాడే కాక అన్నిటికి మించి అతనికి ఒక అన్ని విషయాలను మణిద్వారా తెలుసుకొనే ఒక అలౌకిక శక్తి కూడా ఉంది. మణిసిద్ధుని అసలుపేరది కాదు. అతనికి తల్లిదండ్రులు పెట్టిన పేరు గుణనిధి. ఇతడు కొల్హాపుర నివాసియైన యజ్ఞశర్మ అనే బ్రాహ్మణునకు అగ్నిహోత్రుని వరాన పుట్టాడు. యుక్తవయసు నాటికే సర్వశాస్త్రాలనభ్యసించి మనస్సన్న్యాసం స్వీకరించాడు. తల్లిదండ్రుల మరణానంతరం తత్త్వజ్ఞానాన్ని పొందటానికి గురువును వెదుకుతూ ఒకనాడు ఊరిలో ఉన్న దేవాలయానికి వెళ్లాడు.

అక్కడ విడిదియైన ఒక సిద్ధుని చూచి తనకు సన్న్యాసమిప్పింపుమని కోరాడు. అతడు గుణనిధి కారణజన్మునిగా తెలిసికొని 'నీవలన కొన్ని పురాతన గాథలు భూలోకంలోకి రావలసియున్నా' యంటూ ఒక రత్నాన్ని ఆతనికిస్తూ, "సుయత్నా! నీవీ రత్నాన్నిముందుబెట్టుకొని పూజించి కన్నులు

మూసుకొని ధ్యానిస్తే భూత-భవిష్యద్వర్తమాన కాలాల్లో జరిగిన కథావృత్తాంతాల-న్నీకరతలామలకంగా నీకు సాక్షాత్కరిస్తా"యని చెప్పి ఈ మణిసిద్ధించుటచే నీకు మణిసిద్ధుడనే పేరుపెడుతు-న్నానన్నాడు.

తరువాత అతడు గోవిం-దతీర్థులనే యతీంద్రుని వద్దకు పోయి సన్యాసాన్ని స్వీకరించి మణిసిద్ధయతీం-ద్రుడయ్యాడు.

యతియైన మణిసిద్ధుడు ఒకసారి కాశీకి పోవాలనుకు-న్నాడు. లోకంలో ఒంటరిగా యాత్ర చేయకూడదనే ఒక నియమముంది. అందుచేత తోడు కొరకు బంధువులను, ఊరిలోని పరిచయస్తులను, దగ్గరివారిని అడిగి చూచాడు. కాని అతనితో కాశీకి రావటా-నికి వారిలో ఎవరూ ఒప్పుకో-లేదు. అతడు మార్గ సహా-యునకై వెతుకుతూ చివరకు శ్రీరంగపురం చేరుకున్నాడు. అక్కడ కోటప్ప అనే గొల్లోళ్ల-చిన్నోడిని కలిశాడు.

కాశీకి తనతో పాటు రమ్మని కోరగా అతడు 'సరే' యని అన్నాడు. ఇతడే కాశీమజిలీ కథలకు శ్రోతయైనాడు.

కోటప్ప అనాథ. చిన్నప్పుడే అతని తల్లిదండ్రులు చని-పోయారు. ఆ ఊరి పెద్దకాపు అతనిని పెంచి తన పశువు-లకు కాపరిగా చేసుకున్నాడు. కాని కోటప్పలో అతనికే తెలియని ఒక ఆత్మాభిమా-నముంది. అతనిని ఎవరైనా గాని చివరకు తనను పెంచిన పెద్దకాపుని కూడా 'ఒరేయ్' అని పిలువనీయనట్టి స్వ-తంత్ర ప్రవృత్తి కలిగినవాడు.

తనను పెంచి పెద్దచేసిన యజమానిని వదలి ముక్కూ మొగం తెలియని సన్న్యా-సి వెంట కాశీకి పోవటానికి ఈ మాత్రం స్వతంత్ర ప్రవృత్తి కలవాడై ఉండటం అవసరం. కథలంటే మక్కువ గలవాడు. అంతకుముందే భారతం-లోని కథలు, వరాహావతార చరిత్ర, కామమ్మ కథలవంటి జానపద గాథలు విన్నాడు.

మణిసిద్ధుడాతనికి కాశీ గొ-ప్పతనాన్ని గురించి చెప్పాడు. ఇంకా ఇట్లాంటివే అనేక కథలు చెపుతానన్నాడు. కథలంటే చెవికోసుకొనే అతడు మణిసిద్ధుడు చెప్పిన కాశీమాహాత్మ్యాన్ని విన్న తరువాత అతనితో కాశీకి రావటానికి అంగీకరించా-డు. అయితే అందుకు ఒక నియమం పెట్టాడు.

'నేను మీతో వచ్చేటపు-డు నడుమ తోవలో ఏదైనా ఒక వింత కనబడితే దాని గురించి నేను ప్రశ్నలడుగు-తాను. ఆ ప్రశ్నలకు మీరు తప్పనిసరిగా నాకు ఒక కథగా జవాబు చెప్పాలి. ఇందు-కిష్టమైతేనే మీ వెంట మీ మూటను కూడా మోసుకొని కాశీకి వస్తా'నని ఖండితంగా చెప్పాడు.

అందుకు మణిసిద్ధుడు సరే-నన్నాడు. కోటప్ప విచిత్రాలైన కథలను మార్గమధ్యంలో చె-పుతానన్న మాట తీసుకొని సన్న్యాసి మూటను మోస్తూ కాశీకి బయలుదేరాడు. భారతాది ఇతిహాసాలతో పాటు అనేక పురాణాలను సూతుడు శౌనకాది మునులకు చెప్పిన-ట్లుగా మణిసిద్ధుడు కోటప్పకు భారతాది ఇతిహాసాలుగా కా-శీమజిలీ కథలను చెప్పాడు.

కాశీమజిలీ 12 భాగాల్లోను 42 అద్భుత కథలున్నాయి. అందులో విక్రమార్కునికథ-భోజ కాళిదాసులకథ- శ్రీ-కృష్ణదేవరాయ రామలింగని కథ-లవంగి పండితరాయల కథ-శంకరాచార్యుల కథ-ఫణిదత్తుని కథ-బంగారు మూషికము కథ-చేపనవ్విన కథల వంటివి మనలనెంతో

నలరిస్తాయి.
ఈ కథలన్నీ సామాన్యంగా లోకంలో మనం విన్న కథల్లాగా ఉండవు. ఈ కథల్లో అనేక ఇతిహాస, పౌరాణిక కథలను జోడింపబడ్డాయి. ఇంతేగాక సంస్కృత కథారచయితల కథలు కూడా ఇందులో జతపరచబడ్డాయి.
ముఖ్యంగా గుణాఢ్యుని బృహత్కథనుండి గ్రహింపబడిన అనేక కథలు సందర్భానుసారంగా ఇందులో కలిసిపోయాయి. సాహసకథలు-శృంగారకథలు; పౌరాణిక చారిత్రక-లౌకిక కథలెన్నో మనలను అద్భుతరసంలో ముంచితేలుస్తుంటాయి.
సామాన్యంగా ఒక కథకు ఒక నాయకుడుంటటం సహజం. కాని కాశీమజిలీకథల్లో ఒకడే కా-దు-ఇద్దరు, ముగ్గురు నాయకులున్న కథలున్నాయి. వరప్రసాదుల కథలో ఐదుగురు కథానా-యకులున్నారు. సప్తమిత్ర చరిత్రలో ఏడుగురు కథానాయకులున్నారు. సంస్కృతంలో దండి దశకుమార చరిత్రను పదిమంది నాయకులతో వ్రాశాడు.
కాని కాశీమజిలీ కథల్లో ఇరవై మంది నాయకులతోటి నారదుని కథ అపూర్వంగా మనకు కని-పిస్తుంది. ఈ కథలన్నీ ఒక్క కథ-ఒక్క ఇతివృత్తం అనే పద్ధతిలో ఉండవు. ఒక కథలో మరో కథ-దానిలో మరో కథ అన్నట్లుగా గొలుసుకట్టు కథల్లాగా ఉంటాయి. ఇట్లాంటి విశేష ఉత్కం-ఠభరిత కథలను గూర్చి వివరంగా కాశీమజిలీ కథల ధారావాహిక- మూడో భాగం నుండి తెలు-సుకుందాం.

(సశేషం)

---

# గురు శిష్య పరంపర

(21 వ పేజీ తరువాయి)

పతంజలి మహర్షి వేదాల నుండి యోగ విద్యని విభజించి మానవాళికి అందించారు.

భరత భూమిని వేద భూమిగా మలచి, శ్రమతో దున్ని, జ్ఞాన బీజాలు చల్లి, పండిన పంటను యావత్ ప్రపంచానికి అందించమని గురువులను ఆదేశించడం వల్లనే నేమో "గురు పరంపర" ఏర్పడింది. కావున ఈ విధంగా పండిన పంటను అనుభవించడానికి తప్పక గురువు సన్నిధికి
చేరవలసిందేనని, గురు శిష్య పరంపరను వ్యాసులవారు ఏర్పరచారు.
ప్రతిఒక్క భారతీయుడు "ఇది నా జన్మ హక్కు" అని, గురువులను ఆశ్రయించి, జ్ఞాన సముపార్జన చేసి, ప్ర-పంచానికే వన్నె తెచ్చే విధంగా, శాంతి మార్గాన్ని ఎంచుకుని, మార్గదర్శకత్వం వహిస్తూ, యావత్ ప్రపంచానికి శాంతి మంత్రం నేర్పించాలనే దృఢసంకల్పంతో ఉన్నాను.
నాజీవిత పరమార్థం ఎమిటో తెలియచేసిన నా గురువుల పాద పద్మములకు నమస్కరిస్తున్నాను.
అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ
ఓం శాంతిః! శాంతిః! శాంతిః!

# క్రాంతివీరుడు
# (పండిత్ శ్యామ్ జీ కృష్ణవర్మ)



తుమ్మూరి రాంమోహన్ రావు

సర్వ మతమ్ముల యందలి
సత్సారము దెలియ పరచి
ఆర్యసమాజము నిచ్చట
నెలకొల్పిన ప్రాజ్ఞుడతడు

బొంబై నగరమునందలి
సంస్కరణాభీష్టులతతి
కెల్ల పూజనీయ గురువు
దయానంద సరస్వతి

మనశ్యాముడు దయానంద
కతి సన్నిహిత శిష్యుడాయె
అతని బోధనలను వ్యాప్తము
జేయ నతడు సిద్ధ మాయె

శ్యామ్ జీ ప్రసంగాలకు
ముగ్ధులైరి శ్రోతలెల్ల
ఆతని సంస్కృత పాండితి
కబ్బురపడిరార్యులెల్ల

అమరభాషలో ఆతని
అద్భుత వైదుష్యము గని
కాశ్మీర పండితాళి
పండిత బిరుదమునొసగిరి

బ్రాహ్మణేతరుండైనా
బ్రహ్మవిద్య పట్టు దెలిసె
విద్యచేత విహితుడు తొలి
విప్రేతర పండితుడయె

ఇతని ప్రతిభ ఇంగ్లండున
సుప్రసిద్ధ ఆక్స్ ఫర్డు
సంస్కృత భాషాచార్యుడు
మొనియర్ విలియమ్స్ తెలిసి

శ్యాముని ఇంగ్లాండు పిలిచె
తనకు సహాయక పదవిన
విద్య వలననే సాధ్యం
బయ్యె విదేశీగమనము

పలువురు పండిత శ్రేష్ఠులు
అటకేగుట వారించిరి
దయానందుడనుమతించె
మన ప్రతిభను వెలువరించ

మొనియరు విలియమ్స్ తోడ
పనిచేయుచు ఒకవైపున
బలియలు కాలేజి లోన
బారిస్టరుపూర్తి జేసె

పట్టభద్రుడయినంతనె
ప్రసంగించె పండిత్ శ్యామ్
ప్రతిష్ఠాత్మకమ్మగు రా
యల్ సొసైటి వేదిపైన

భారతీయ రచనాతతి
కాదిమూలమను విషయము
నద్భుతముగ నుక్కడించె
అలరించెను సభనెల్లను

ప్రతిభ పట్టు చాలుకదా
పరదేశంబైన నేమి?
సభ్యుడయ్యె సొసైటీలో
స్థానికేతరుండైనను

ఆ పిమ్మట బెర్లిన్‌లో
ప్రాచ్యభాష పండిత సభ
నలరించెను భరతదేశ
ప్రాతినిధ్యమును వహించి

పత్తిబేళ్ల కార్ఖానా
కార్మికునికి పుత్రుడేమి?
సంస్కృతభాషా దక్షుడు
విదేశాన విబుధుడేమి?

విద్యయొకటి యున్న చాలు
దాచుకొన్న నిధివంటిది
ఎచటికేగినా యశస్సు
భోగభాగ్యమొసగెడునది

అందుకు చక్కని తార్కా
ణమ్ము శ్యామ్ జీ పండిత్
కృష్ణవర్మ మహాశయుడు
అచిరకాల మహాయశుడు

మూడవకొమ్మ

పదునెనిమిది వందల ఎను
బది యైదవ వత్సరాన
శ్యామ్ జీ కృష్ణవర్మ
స్వదేశమరుదెంచినాడు

న్యాయవాదవృత్తిని చే
పట్టి పేరుపొందినాడు
రత్లాం రాజ్యపు దివాను
గా నియతంబయ్యినాడు

అస్వస్థత కారణాన
అనివార్యముగా పదవిని
వదలివేయవలసివచ్చె
రాజు భూరి భరణమిచ్చె

ఎంత వింత కొంత కాలమే
యతడటపనిచేసెను
తన తెలివికి రాజు మురిసి
పెద్దమొత్తమందించెను

నాటికాలమున ముప్పది
వేలరూక లనుతోషిక
మంటే మాటలు కాదది
ఘనత అతని ఘన విద్యది

ముంబయిలో కొంతకాల
ముండి చేరె అజ్మీరుకు
అచటి బ్రిటిషు న్యాయ స్థాన
మందు న్యాయవాది యయ్యే

గురువు దయానందుడచట
స్థిరమై యున్నందు వలన
అజ్మీరున నివసించుట
కతడు నిర్ణయించుకొనెను

తనకడగల సొమ్ముతోడ
మూడు పత్తిబేళ్ల మిల్లు
లచటనె స్థాపించి నికర
ఆదాయపు హరువు జేసె

మేధా సంపత్తి గలిగి
ఊరక యెటులుండగలుగు
ఉదయపూరు సంస్థానము
రాజ్యసభా సభ్యుడయ్యే

రెండు వత్సరాల పిదప
జునాగడుకు దివానయ్యె
బ్రిటిషు వారి కొండెములతొ
ఆ పదవిని వదలి పెట్టె

దయానంద సన్నిధిలో
గడిపినాడు కొన్నినాళ్లు
సత్యార్థ ప్రకాశమ్మును
చదివినాడు అన్నినాళ్లు

ఆర్యసమాజస్థాపన
ఆంతర్యమ్మును గ్రహించె
దయానంద అడుగు జాడ
లందు శ్యాము అనుగమించె

మనదేశానికి మనమే
పాలకులం కావాలి
స్వరాజ్యమే లక్ష్యంగా
పోరుబాట నడవాలి

దయానందుడందించిన
ఉద్యమ స్ఫూర్తిని గైకొని
లోకమాన్య బీజి తిలకు
మున్ముందుకు సాగుచుండ

భారతీయులకె భారత
భూమియనుచు పిలుపునిచ్చె
స్వరాజ్యమను మాట తొలుత
దయానందుడుచ్చరించె

ఆతని మాటను గైకొని
అనుసరించె లోకమాన్య
జన్మహక్కు స్వరాజ్యమని
నినదించెను ఉత్సాహమున

తిలకు ప్రభృతులకు తోడు
నిలచినాడు కృష్ణవర్మ
స్వాతంత్ర్యోద్యమ వ్యాప్తిని
అరసినాడు నిశిత ద్రష్ట

విన్నపాలు విజ్ఞాపన
లిచ్చుటేల ఆంగ్లేయుల
లెక్కసేయనేల వారి
దేబరించు దుస్థితేల

కాంగ్రెసు నేతల పద్ధతి
కృష్ణవర్మ మెచ్చలేదు
సిగ్గుచేటుగా తలంచి
కాంగ్రెసులో చేరలేదు

పూనాలో ప్లేగు వ్యాధి
ప్రబలినపుడు బ్రిటిషువారి
దురుసుతనం దుందుడుకుల
నిర్లక్ష్యం నచ్చలేదు

ప్లేగు వ్యాధి వివాదమున
ప్లేగు కమీషనరును హత్య
గావించిన చాపేకరు
సోదరులను సమర్థించె

కేసరి పత్రికలో తిలకు
మహాశయుడు విషయమంత
ఎండగట్టినందుకతని
జైలులోన వేయుట గని

నిరంకుశము అతి క్రూరము
నిర్దయాత్మ ప్రభుత నుండి
సానుకూల ఫలితము నా
శించుటయే యవివేకము

అని బ్రిటిషుల దమననీతి
కంతరంగమున వగచెను
బ్రిటను దేశమందుండియె
పోరాడుటకై తలచెను

ధనమును సమయము తెలివిని

(50 వ పేజీ చూడడండి)

# షడ్దర్శనాలు

కీ. శే. వేమూరి నరసింహమూర్తి & వేమూరి వేంకటేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

1. జీవితము దుఃఖపూరితము. ఈ జీవితమే ఒక జాడ్యము.
2. ఈ జాడ్యమునకు కారణము "అవిద్య." అనగా, ఆత్మ యొక్క నిజ స్వరూపమును ఎరుగకపోవుట.

మనం సాధారణంగా "ఆత్మ" ఈ శరీరం కంటే భిన్నమయినది అని అనుకుంటాం. శరీరం నశించినా ఆత్మ నశించదు అని నమ్ముతాం. కానీ బౌద్ధులు మొదట్లో అలా అనుకోలేదు. నామ రూపములతో కూడిన మనో శరీరముల సంఘాతమే ఆత్మ అని వారనుకున్నారు. ఆత్మని ఈ విధంగా అర్థం చేసుకుంటే ఆత్మ శాశ్వతమయినది అని అనుకోడానికి వీలు లేదు. అది ఎల్లప్పుడూ మార్పులు చెందుతూనే ఉంటుంది - నిర్వాణ స్థితి వచ్చేవరకు! క్షణక్షణమూ మార్పు చెందే ఈ కుహనా ఆత్మకు అంటిపెట్టుకోవడం వల్లనే బాధలు వస్తాయి అంటారు బౌద్ధులు.

3. బాధలు కలిగించబడ్డాయి కనుక వాటి కారణాన్ని నిర్మూలిస్తే, బాధలు కూడా నిర్మూలమవుతాయి.

కార్యకారణములు (cause-effect) అనే గొలుసు లంకెల వలె జీవితంలో సంసార బంధాలేర్పడి బాధలు కలుగుతాయి. ఈ లంకెలలో ముఖ్యమయినవి నాలుగు: అవిద్య, తృష్ణ, జననం, మరణం. అవిద్య వలన స్వార్థ పూరితమైన తృష్ణ ఏర్పడుతుంది. ఈ తృష్ణ మిగిలిన లంకెల సహాయంతో జననమరణాల చక్రాన్ని ఏర్పరుస్తుంది. ఎవరైతే ఈ సంసార చక్రాన్ని ఛేదిస్తారో వారికి ఈ జన్మలోనే నిర్వాణ స్థితి కలుగుతుంది.

4. అవిద్యకు వ్యతిరేకం విద్య కాబట్టి, అవిద్య వల్ల సంసారబంధాలు ఏర్పడుతాయి కాబట్టి, విద్య వల్ల సంసారబంధాలు విడతాయి. ఇక్కడ "విద్య" అంటే ఆత్మ యొక్క నిజ స్వరూపాన్ని తెలుసుకోవడం.

5. బౌద్ధంలో చీలికలు

తరువాత బౌద్ధమతం హీనయానం, మహాయానం అని రెండు శాఖలుగా చీలిపోయింది (~సా.శ.పూ.100). వీరిలో తేడాలు ఉన్నా, ఒక్క విషయంలో మాత్రం ఈ రెండు శాఖలూ ఏకీభవిస్తాయి. అది వీరి "క్షణభంగ వాదం." ఈ వాదంలో ఏదీ నిత్యం కాదు. క్షణక్షణమూ మార్పు చెందడమే వస్తువుల లక్షణం. ఒకే ప్రవాహంలో రెండు సార్లు దిగలేము కదా! అందుచేత ప్రపంచం కానీ, ఆత్మ కానీ క్షణ కాలం కంటే ఎక్కువ సేపు నిజం కాదు. కనుక



వేమూరి వేంకటేశ్వరరావు

బాహ్య ప్రపంచం శాశ్వతం కాదు అంటారు హీనయానం వారు.

మహాయానం వారు మళ్ళా విజ్ఞాన వాదులనీ, మాధ్యమికులనీ రెండుగా చీలిపోయారు. విజ్ఞాన వాదుల బాణీ ఈ విధంగా నడుస్తుంది. వస్తువుకు చెందని భావం లేదు. భావానికి చెందని వస్తువు ఉండదు. అంటే మనస్సులో ఏదయినా ఊహ పుట్టిందంటే దానికి ప్రతిగా బాహ్య ప్రపంచంలో ఎదో ఒక వస్తువు ఉండి తీరాలి. బాహ్య ప్రపంచంలో వస్తువు ఉన్నదీ అంటే దాని గురించిన భావన మన మన్సులో ఉన్నదన్నమాట. కనుక వస్తువు వేరు, భావన వేరు కానేరదు. అనగా బాహ్య ప్రపంచం అంతా మనస్సుకి ప్రతిబింబం అన్నమాట. అనగా ప్రతి వ్యక్తికీ తానొక్కడే నిజం; మిగిలినదంతా తన ప్రతిబింబం అనిపిస్తుంది. పాశ్చాత్య తత్త్వశాస్త్రంలో సరిగ్గా ఇటువంటి వాదనే ఒకటి ఉంది. దానిని subjective idealism అంటారు.

మహాయానంలో రెండవ శాఖ అయిన మాధ్యమిక వాదాన్ని

సృష్టించినది నాగార్జునాచార్యులు (~ సా. శ. 200). ప్రపంచం యొక్క ఉనికిని కార్యకారణ వాదంతో అన్వయించడం సాధ్యం కాదంటారు వీరు. ఆది పదార్థాన్ని ఎవరు సృష్టించేరు? దేవుడయితే ఆ దేవుడిని ఎవరు సృష్టించేరు? పోనీ, మొదట్లో ఏమీ లేదనుకుంటే, తర్వాత ఉన్నదనుకుంటున్న ప్రపంచం ఎక్కడినుండి వచ్చింది? ఏమీ లేదనుకునే దానిలో ఉండడం అనేది ఎలా సంభవిస్తుంది? ఈ విధంగా కార్యకారణ వాదం వీగిపోయింది. దీనితో క్షణభంగ వాదాన్ని మేళవించి చూస్తే ప్రపంచం అనేది లేదని తెలుతుంది. ప్రపంచాన్ని గురించి ఊహించే "నేను" లేను. కనుక జీవి లేదు. జీవి లేకపోతే బంధాలు లేవు. బంధాలే లేకపోతె మోక్షము అనే మాటకి అర్థమే లేదు. కనుక మోక్షం లేదు. ఉన్నదల్లా శూన్యం! అందుకే దీనిని నాగార్జునిని శూన్యవాదం అంటారు.

ఏమిటీ శూన్యం? ఒక మనిషి వెలుగులో వస్తువుల ఉనికిని తెలుసుకోగలుగుతున్నాడంటే కారణం వెలుగా? లేక మనిషిలోని చైతన్యమా? వెలుగు అంటారా? ఇప్పుడు ఆ మనిషిని చీకటి గదిలో పెట్టండి. చేతులతో తడిమి వస్తువు ఎక్కడ ఉందో చెబుతాడు. చేతులు కట్టి వేస్తె శబ్దమును బట్టి వస్తువు ఉనికి గ్రహించవచ్చు. అంటే ఏమిటి? శరీరంలో ప్రజ్ఞ ఉన్నంతసేపూ స్మృతిని బట్టి వస్తువుల ఉనికిని గ్రహించవచ్చు. కనుక బాహ్య ప్రపంచాన్ని తెలుసుకునేది జీవిలోని అంతర్జ్యోతి. ఇదే స్వయంప్రకాశమానమయిన బ్రహ్మ పదార్థం! ఇదే Infinite Consciousness! ఈ భావం నాగార్జునిని "అంతిమ సత్యం" (Ultimate Reality) యొక్క నిర్వచనానికి సరిపోతుంది. కానీ స్పష్టంగా కనిపిస్తూన్న ఈ ప్రపంచం లేదు అనడం చాలామందికి నచ్చలేదు. ఇటువంటి భావాన్ని వర్ణించడానికి ఏ భాషలోనూ మాటలు లేవు. ఇంద్రియాలు చాలవు.

6. కుమారిలభట్టు

ఇప్పుడు తెలుస్తుంది పూర్వమీమాంసని సమర్థించిన కుమారిలభట్టు (~ సా. శ. 720) గొప్పతనం! ప్రమాణాల విషయంలో ఎవ్వరితోనూ రాజీ పడకుండా ఈయన అద్వితీయమైన దారి తొక్కేడు. మిగిలిన విషయాలలో పెద్దగా పేచీ రాలేదు కానీ అభావ ప్రమాణం (negation) విషయంలో ఎవ్వరి పద్ధతిని ఒప్పుకోలేదీయన.

నైయాయికులు అభావాన్ని ఇంద్రియ గోచరము, ప్రత్యక్ష ప్రమాణము అన్నారు. ఉదాహరణకి "బల్ల మీద పుస్తకం ఉంది" అన్నామనుకోండి. ఇక్కడ బల్ల పుస్తకానికి ఆధారం. "బల్ల మీద పుస్తకం లేదు" అన్నామనుకోండి. లేదని ఎలా తెలిసింది? బల్ల ఖాళీగా కనిపిస్తూంది కనుక. ఈ ఖాళీని చూడగలగడం ఇంద్రియ గోచరత్వం (perception of senses). బౌద్ధులు అభావం ప్రత్యక్ష ప్రమాణం కాదు, అనుమాన ప్రమాణం అన్నారు. ఎందుచేతనంటే ఖాళీ బల్లను చూడడం జరిగింది. పుస్తకం మనస్సులో ఉంది గనుక, "బల్ల మీద పుస్తకం లేదు" అని నిర్ణయం చేసేం.

నైయాయికులు చెప్పినట్లు ఆధారం యొక్క శూన్యతను బట్టి పుస్తకం యొక్క ఉనికిని నిర్ణయించేటట్లయితే చాలా చిక్కులు వస్తాయన్నారు కుమారిలభట్టు. పుస్తకం ఉన్నదా, లేదా అన్న విషయం నిర్ణయించడానికి బల్ల ఉనికి అవసరం అయితే, బల్ల ఉనికిని నిర్ణయించడానికి నేల, ఆ నేల ఉనికికి భూమి, ఆ భూమి ఉనికికి విశ్వం! దాని ఉనికికి ఆధారం ఉన్నదా? లేదా? లేకపోతె ఈ విశ్వం ఉందో, లేదో తెలుసుకోవడం ఎలా? అందుచేత అభావము ప్రత్యక్ష ప్రమాణమూ కాదు, అనుమాన ప్రమాణమూ కాదు. అది ఒక స్వయం ప్రమాణం (independent means of knowledge) అన్నారు కుమారిలభట్టు.

అనంతమైన భగవత్స్వరూపాన్ని వర్ణించి చెప్పడానికి పరిమితమైన కొలబద్దలు చాలవు. చెట్టు, పుట్ట, బల్ల, పుస్తకము, ..., ఇవేవీ దేవుడు కాదు. నశించే ఇలాంటి వస్తుజాలాన్ని తీసి పారెయ్యగా మిగిలేది బ్రహ్మము. అన్నీ తీసివేయగా మిగిలేది "లేకపోవుట" అనే స్థితి. అనగా "బ్రహ్మ పదార్థం" అనేది లేదన్నమాట? ఇది సరి అయిన వాదం కాదు.

(సశేషం)

# మహాభారతంలో అభిమన్యుడు



పాలకుర్తి రామమూర్తి

చంద్రుని అంశతో సుభద్ర- అర్జునులకు జన్మించిన వాడు, అభిమన్యుడు. కృష్ణుని మేనల్లుడు. అచంచల ధైర్య సాహసాలు, పరాక్రమాన్ని ప్రదర్శించి, చిన్నవయసులోనే మరణించినా, మహాభారతంలో ప్రధాన పాత్రలలో ఒకనిగా ప్రఖ్యాతిని పొందాడు. భయంకర యుద్ధం చేయడంలో భీమునికి సాటిగా, విలువిద్యా నైపుణ్య ప్రదర్శనలో అర్జునునికి సాటిగా పరిగణింపబడిన పరాక్రమం అభిమన్యునిది. అర్జునుని వద్ద దివ్యాస్త్ర ప్రయోగ ఉపసంహారాలతో సహ ధనుర్విద్యను అభ్యసించి, వివిధ వ్యూహాలలో ప్రవేశించడం, ఛేదించడం, ఆపత్కాలంలో వెలుపలికి రావడం నేర్చాడు. పద్మవ్యూహంలోకి ప్రవేశించడం తెసుకున్నా ఆపత్కాలంలో వెలుపలికి రావడం మాత్రం అప్పటికి నేర్వలేకపోయాడు.

మరణించే నాటికి అతని వయసు గూర్చి పలు విధాలయిన కథలు ప్రచారంలో ఉన్నాయి. అద్భుతాలను ఇష్టపడే సాధారణ జనాలను ఆకర్షించేందుకు ప్రచారం చేయబడ్డ కథల ఆధారంగా కురుక్షేత్ర యుద్ధం నాటికి అతడు 16 సంవత్సరాల వాడని తెలుస్తున్నా అది హేతుబద్ధం కాదు. అలాగే అతడు రాక్షసాంశలో జన్మించాడని.. అందుకే అతని మరణం తనకు తెలిసినా కృష్ణుడు అతనిని రక్షించలేదనే కథలూ ప్రచారంలో ఉన్నాయి. వాటికి తెలుగు భారతంలో అవసరమైన ఉపపత్తి కనిపించదు.

ఆయా కథల ప్రచారం సరైనది కాదని చెప్పేందుకు ఉపపత్తిగా కొన్ని అంశాలను పరిశీలిస్తే..

1. పాండవులు జూదంలో ఓడి నియమం ప్రకారం 12 సంవత్సరాల అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం చేసారు. అంటే యుద్ధ సమయం వరకు 16 అనుకుంటే.. అందులో 13 సంవత్సరాలను తీసివేస్తే.. 3 సంవత్సరాలు లేదా అంతకన్నా తక్కువ.. 3 సంవత్సరాల పిల్లలకు ఉపనయనం చేసి విద్యలను నేర్పడం, అందునా అర్హత ప్రాతిపదికగా ఇవ్వవలసిన దివ్యాస్త్రాలను ఇవ్వడం అసంభవం. ఎంత తండ్రియే అయినా అర్జునుడు అభిమన్యునికి అలా బోధించాడనడం సహేతుకం కాదు..

2. రాజసూయ యాగం సమయంలో.. ధర్మరాజు.. యాగానికి వచ్చిన అతిథులను సాగనంపే తరుణంలో ఒక్కొక్కరిని సాగనంపేందుకు ఒక్కొక్కరికి బాధ్యతను అప్పగించాడు. ఆ సందర్భంలో పార్వతీయ మహారాజులను సాగనంపేందుకు అభిమన్యుని మరియు ఉపపాండవులను నియమించాడు. అంటే అప్పటికి వారి వయసు 3 సంవత్సరాల కన్నా తక్కువ. అంత తక్కువ వయసు గలిగిన వారికి అలాంటి బాధ్యతను అప్పగించాడనడం హాస్యాస్పదం..

అలాంటి తరుణంలో అతని వయసును నిర్ణయించేందుకు ప్రాతిపదిక ఏమిటి? అని ఆలోచిస్తే.. ఆపస్తంబ సూత్రం ప్రకారం ఉపనయన సంస్కారం.. బ్రాహ్మణులకు గర్భాష్టమంలోనూ (అనగా 8 సంవత్సరాలకు), రాజులకు గర్భైకాదశము (అనగా 11 సంవత్సరాలకు) చేయాలి. అనగా పుట్టాక 10 లేదా 11 సంవత్సరాలకు ఉపనయనం చేసాక విద్యలను నేర్పడం అసమంజసమూ కాదు. అభ్యాసం చేసిన విద్యలను కురుక్షేత్రంలో ప్రదర్శించిన నాటికి 25 - 26 సంవత్సరాల వయసు అనుకుంటే అది హేతుబద్ధమే. అలాగే 11-12 సంవత్సరాల పిల్లలు రాజులను సాగనంపడానికి వారి వెంట వెళ్లారనడమూ సమంజసమే.

అభిమన్యుడు భీష్మద్రోణ పర్వా-

లలో కలిపి 13 రోజులు జరిగిన యుద్ధంలో తప్ప మిగతా భాగాలలో పెద్దగా కనిపించడు. భీష్ముడు పడిపోయాక కౌరవ సైన్యానికి ద్రోణుడు సర్వసైన్యాధిపతిగా అభిషిక్తుడౌతాడు. ఆ సమయంలో ద్రోణుడు వరం కోరుకోమనగా దుర్యోధనుడు ధర్మరాజును ప్రాణాలతో బంధించి అప్పగించమని కోరుతాడు. దానికి "అర్జునుడు లేని సమయంలో మాత్రమే ఎవరు అడ్డినా ధర్మజుడిని పట్టుకోగలను".. అంటాడు, ద్రోణుడు. 13 వ నాటి యుద్ధంలో దుర్యోధన ప్రేరితులై సంశప్తకులు అర్జునుడిని యుద్ధరంగం నుండి దూరంగా తీసుకు వెళతారు. ద్రోణుడు పాండవ బలంలో ఎవరికీ ఛేదించరాని పద్మవ్యూహాన్ని పన్ని.. ముఖద్వారంలో తాను నిలుస్తాడు. అప్పుడు ధర్మరాజు ముందు రెండే ఐచ్ఛికాలు ఉన్నాయి. యుద్ధంలో నిలిచి ద్రోణునికి పట్టుబడడమూ.. లేదా యుద్ధానికి దూరంగా తొలగిపోవడమూ.. ఆ సందర్భంలో ధర్మరాజు అభిమన్యుని పిలిచి పరిస్థితిని తెలిపి.. నీవు ఈ వ్యూహాన్ని కొంత చించు.. నిన్ననుసరించి మేమంతా లోనికి వస్తామని చెపుతాడు. ఆ వ్యూహంలోనికి వెళ్ళడమే కాని ఆపదలు క్రమ్ముకున్న వేళ బయటకు రావడం తెలియని అభిమన్యుడు సాహసంతో లోనికి వెళ్ళి పలువురు యోధులను సంహరించి.. చివరగా దుర్యోధన, కర్ణ, ద్రోణాది ఆరుగురు అతిరథు-



లు అధర్మంగా చేసిన యుద్ధంలో వీరమరణం పొందుతాడు.

ఇక్కడ కొన్ని అంశాలను పరిశీలించాలి.. అభిమన్యుని మరణం దైవికమా.. మానుషమా? దీనికి దారితీసిన పరిస్థితులు ఏమిటి?

1. దుర్యోధనుడు అర్జునుని దూరంగా పంపేందుకు సంశప్తకులను నియోగించడం.. మానవ ప్రేరితం..

2. అర్జునుడు ఉండడని తెలిసీ పాండవుల కెవరికీ భేదింప శక్యము కాని పద్మవ్యూహాన్ని ద్రోణుడు పన్నడం.. మానవ ప్రేరితం..

3. వ్యూహ ముఖంలో ద్రోణుడు కాక సైంధవుడు నిలవడం. ద్రోణుడే ఉన్నట్లయితే భీమాదులు అతనిని జయించి లోనికి వెళ్ళడానికి పెద్దగా ఇబ్బంది పడేవారు కాదు. వారి సహాయం అభిమన్యునికి అందేది. అభిమన్యుడు చనిపోయేవాడు కాదు. దానికి తార్కాణంగా తెల్లవారి యుద్ధంలో భీముడు, సాత్యకి కూడా ద్రోణుని అధిగమించి వ్యూహంలోకి చొరబడ్డారు. అయితే ఈశ్వర వరప్రసాదంతో ఒకరోజు పాండవులను జయించగలిగిన సైంధవుడు ససైన్యంగా పాండవులను అడ్డుకోవడం వల్ల అది సాకారం కాకపోవడం.. దైవ ప్రేరితం..

4. అభిమన్యుని బలహీనత తెలిసీ అతనిని వ్యూహంలోనికి ధర్మరాజు పంపడం.. మానవ ప్రేరితం..

5. "దేవయుక్తుడై అనికి బలారి వచ్చినను, పురారి బలంబులు దాను బన్నినన్, గినిసి కడింది క్రీడియును కృష్ణుడు దాకిన నే జయింతు..

సరకు గొందునే ద్రోణుని.. తోడి యోధులన్" అనడంలో వీరోక్తుల కన్నా అహంభావం అధికంగా కనిపిస్తుంది. అలా పలికడం.. మానవ ప్రేరితం..

6. "అహమేత త్ప్రవక్ష్యామి ద్రోణానీకం దురాసదం పతంగ ఇవ సంకృద్ధో జ్వలంతం జాతవేదసం" అంటాడు.. వ్యూహం లోనికి వెళ్ళే సమయంలో అభిమన్యుడు. మంటలో దూకు మిడతవలె నేను ద్రోణ సైన్యంలో ప్రవేశిస్తాను అంటాడు.. మంటలో దూకే మిడత మరణిస్తుంది... అలా అమంగళాన్ని అనుకోకుండా పలకడం.. దైవప్రేరితం.

7. ధర్మరాజు ఆశీస్సులు అందించే సమయంలో.. విజయోస్తు అనే మాట కాకుండా.. "ఏవంతే భాషమాణస్య బలం సౌభద్ర వర్ధతాం" అంటాడు. నీ ధీరత్వమూ, శూరత్వమూ, బలమూ, యశస్సూ వృద్ధి పొందును గాక.. అనడమూ.. దైవ ప్రేరితం..

8. వంచన చేసి ఆరుగురు అతిరథులు తనను వెనుకనుండి దెబ్బతీస్తారని ఊహిస్తే అభిమన్యుడు తగిన విధంగా స్పందించే వాడే కాని అలా ఊహించలేక పోవడం.. దైవప్రేరితం..

9. అభిమన్యుడు వ్యూహాన్ని ఛేదించి లోనికి వెళ్ళిన వేళ చూస్తే.. మొదటి నుండి ముఖద్వారం వద్ద సైంధవుడే ఉంటే.. వాని కి ఈశ్వరుడిచ్చిన వరప్రభావంతో అభిమన్యుడు కూడా లోనికి వెళ్లగలిగేవాడు, కాదు. అభిమన్యుడు మరణించే వాడుకాదు.. ధర్మరాజు పట్టుబడేవాడు కాదు. అలా జరగక పోవడం.. దైవప్రేరితం..

10. ఆకాశ గమనాది విద్యలు తెలిసిన ఘటోత్కచుడు లాంటి వారు కూడా సైంధవుడు అడ్డడంతో అభిమన్యుని సహాయానికై వ్యూహం లోనికి వెళ్ళలేకపోవడం.. దైవప్రేరితం..

11. అభిమన్యుడు ఒంటరిగా లోనికి వెళ్లడమూ.. అతనికి సహాయపడేందుకు తామెవరూ లోనికి వెళ్లలేకపోవడానికి కారణంతో సహా విషయాన్ని అర్జునునికి ఆకాశ గమన విద్యను తెలిసిన ఘటోత్కచునితో చెప్పి పంపాలనే ఆలోచన ధర్మరాజుకు రాకపోవడము.. దైవప్రేరితము..

12. విషయం తెలిస్తే అర్జునుడు ముందురోజు వచ్చి భగదత్తుని సంహరించిన విధంగా అభిమన్యునికి సాయపడేవాడు.. ఆ ఆలోచన ధర్మరాజు రాకపోవడము.. సర్వజ్ఞుడైన కృష్ణుడూ ఉదాసీనుడై యుండడమూ.. దైవప్రేరితము..

కారణం.. మానుషమైనా.. దైవమైనా.. అడవి యేనుగు కొలనులో ప్రవేశించి.. అడ్డుఅదుపూ లేకుండా క్రీడిస్తూ ఉండగా మనసులో జంకూ గొంకూ లేక, దయాదాక్షిణ్యాలను తలపని బోయలు దాని చుట్టూ చేరి చంపిన విధంగా ఆరుగురు అతిరథులు అధర్మంగా, కపటోపాయంతో అనేకమంది సైనికులు తోడుగా అభిమన్యుని సంహరించడం.. కనిపిస్తుంది, భారతంలో.

కౌరవ సర్వసైన్యాధిపతిగా, అధర్మమార్గంలో ద్రోణుని నాయకత్వంలో జరిగిన రౌద్రకర్మ భారతంలో మనకొక పాఠాన్ని నేర్పుతుంది. యుద్ధారంభం వరకే ధర్మాధర్మాల చర్చ.. ఆలోచన కాని ఒకసారి యుద్ధంలోకి అడుగుపెట్టాక ధర్మమా అధర్మమా అని గాక గెలుపే పరమావధిగా సాగుతుంది.

యువతలో తనను తాను నిరూపించుకోవాలనే అమితమైన ఉత్సాహం ఉంటుంది.. సాహసం ఉంటుంది.. సాధించాలనే తీవ్రమైన తపన ఉంటుంది. దానిని సరైన మార్గంలో సరైన వసతులు, వనరులు, వాతావరణాన్ని కల్పించి అనుభవజ్ఞులైన పెద్దలు ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు ఆవిష్కృతమౌతాయి. జయాపజయాలు ప్రక్కన పెడితే.. కార్య సాధనా దీక్షతో ముందుకు సాగడంలో పెద్దలు యువతకు ప్రేరణనివ్వాలి.. దేశ రక్షణలో, జాతి మర్యాదను కాపాడడంలో.. పరిస్థితులు అనుకూలించినా ప్రతికూలంగా ఉన్నా తన వంతు కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహించిన అభిమన్యుని లాంటి యువత దేశాభ్యుదయానికి దోహదపడుతుందే కాని.. నిరాసక్తులై, నిర్లిప్తత ఆవహింపగా వ్యసనాల పాలబడి, నిర్వ్యాపారులైన యువత వల్ల జాతికి ఒరిగేది ఏమీలేదని అభిమన్యుని పాత్ర బోధిస్తుందని నా విశ్వాసం.

పాలకుర్తి రామమూర్తి

# బ్రహ్మఖండం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.
ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.
ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.
పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

23.వ. అధ్యాయం.

చక్రతీర్థ ప్రశంస.

అగ్ని తీర్థంలో స్నానం చేసాక చక్రతీర్థాన్ని సేవించాలి. చక్రతీర్థంలో ఏ కోరికతో స్నానంచేస్తే ఆ కోరిక ఫలీస్తుంది. అహిర్బుధ్న్యుడు అను మహర్షి గంధమాదన పర్వతంపై సుదర్శన చక్రాన్ని ఉపాసించాడు.

అక్కడ ఉన్న మహర్షులు తపస్సు చేసుకుంటూ ఉండగా రాక్షసులు భగ్నం చేస్తూ ఉండేవారు. సుదర్శన చక్రం ఆ రాక్షసులను సంహరించింది. అహిర్బుధ్న్యుడు ఆ ప్రాంతంలో ఒక తీర్థాన్ని ఏర్పాటు చేసాడు. ఆ నాటి నుండి ఆ తీర్థాన్ని చక్రతీర్థం అని పిలుస్తున్నారు.

పూర్వం దేవతలను రాక్షసులు బాధిస్తూ ఉండేవారు. దేవతలందరు ఇంద్రుని తీసుకొని బ్రహ్మదగ్గరకు వెళ్ళి రాక్షసులవలన కలుగుతున్న బాధలను వివరించారు. " దేవతలారా! మహేశ్వరము అను యజ్ఞాన్ని చేయండి. ఈ గంధమాదన పర్వతం మీద యజ్ఞాన్ని ఆచరిస్తే సుదర్శన చక్రం మీ యజ్ఞానికి విఘ్నం రాకుండా రక్షిస్తుంది. అని బ్రహ్మ దేవతలకు చెప్పాడు.




"

అహిర్బుధ్న్యుని ఆశ్రమానికి కొద్ది దూరంలో దేవతలు యజ్ఞ వాటికను నిర్మించారు. " ఇష్టిని ఆరంభించారు. బృహస్పతి హోతగా ఉన్నాడు. జయంతుడు " మైత్రావరుణుడు" గాను, అష్టమ వసువు " అచ్ఛావాకుడు"(పదహారుమంది ఋత్విజులలో ఒకడు) గా, విశ్వామిత్రుడు ప్రతివస్థాతగా,వరుణుడు ఉన్నేతగా, సవిత బ్రహ్మగా, వసిష్టుడు బ్రాహ్మణాం ఛపి, శునః సేపుడు అగ్నీధ్రుడు అయ్యాడు. వాయువు ఉద్గాత, యముడు ప్రస్తోత, అగస్త్యుడు ప్రతిహర్త, విశ్వామిత్రుడు సుబ్రహ్మణ్యుడు మధుచ్ఛందుడు అయ్యాడు., ఇంద్రుడు యజమానిగా వ్యవహరించాడు. శుకుడు ఉపద్రష్టగా వ్యవహరించాడు. దేవతలందరు ఇంద్రునిచేత యజ్ఞ దీక్ష వహింప చేసారు. ఈ విధంగా యజ్ఞం ఆరంభమయింది. రాక్షసులు యజ్ఞానికి భంగం కలిగించలేక పోయారు. పురోడాశాన్ని అగ్నిలో హోమంచేసారు. అగ్ని పురోడాశాన్ని స్వీకరించగానే చేతులు ఖండించబడ్డాయి. " దేవతలారా! నాకు ఇచ్చిన పాశ్రితము అను పురోడాశము. దీన్ని స్వీకరించగానే నా చేతులు పోయాయి. నా చేతులు తిరిగి నాకు ఇవ్వండి, లేదా మీ యజ్ఞాన్ని ధ్వసం చేస్తాను" అని అగ్ని పలికాడు. " ఓ ఋత్విజులారా నా మాట వినండి. పూర్వం హరి హరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఒకరోజున ఆ బ్రాహ్మణుడు అరణ్యంలో సంచరిస్తుండగా ఒక వేటగాడు విడిచిన బాణం

తగిలి పాదం పోయింది. అతడు ఈ చక్ర తీర్థంలో స్నానం చేసి పాదాన్ని తిరిగి పొందాడు. .అందువలన ఓ సూర్యా! నీవుకూడా చక్రతీర్థంలో స్నానం చేయి. నీవు చేతులను తిరిగి పొందుతావు "అని అష్టావక్ర మహర్షి చెప్పాడు. సూర్యుడు చక్రతీర్థంలో స్నానం చేసాడు. చేతులు తిరిగి పొందాడు. దేవతలు ఆనందించి యజ్ఞాన్ని పూర్తిచేసారు. దేవతలు స్వర్గానికి వెళ్ళిపోయారు. ఈ తీర్థాన్ని సేవిస్తే అంగవైకల్యం పోతుంది. ముక్తి లభిస్తుంది.

స్కాందపురాణంలోని బ్రహ్మఖండంలో సేతుమహాత్మ్యంలో " చక్రతీర్థ ప్రశంస" అను ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

# జ్ఞాపకాల దొంతరలో

ఎలక్ట్రాన్



(గత సంచిక తరువాయి)

అయితే నవంబరు 62 లోనే చైనీయులు అనూహ్యంగా తామంతట తాముగానే మరి ముందడుగు వేయకుండా వెనుదిరిగి వెళ్ళిపోయారు. చైనీయుల ఈ చొరబాటు, నిష్క్రమణల వెనక అమెరికా, క్యూబా, టిబెట్, చైనాల ప్రపంచ రాజకీయాలున్నాయి. మా స్థావరం తిరిగి గాడిలో పడ్డానికి ఆరు నెలలు పట్టింది. యుద్ధవిరమణ జరిగిన వెంటనే తిరిగి వచ్చిన ఉద్యోగులు స్థానికుల హేళనలకి పాలైయ్యారన్న సంగతి వేరుగా చెప్ప నక్ఖర్లేదు.

చంద్రమండలం మీద మానవుడు అడుగుపెట్టిన 1969 నాటికి నేను జమ్మూ స్థావరానికి బదిలీ మీద వెళ్ళాను. జమ్మూకి నలభై కిలోమీటర్ల దూరంలో హిమాలయ పాదపర్వతాలలో ఉన్న సూరిన్సర్ అనే ఒక లోయలో ఆరువేల మిటర్ల లోతు లక్ష్యంగా త్రవ్వడానికి అతిశక్తివంతమైన రిగ్ ను నియుక్తం చెయ్యడం జరిగింది. లోయకి కొద్దిగా పై ఎత్తులో సూరిన్సర్ అనే ఒక పెద్ద సరస్సు ఉంది. ఆ సరస్సు తీరాన ఒక క్యాంప్ నిర్మింపబడింది. ఉద్యోగులందరి స్థిరనివాసమూ జమ్మూలోని అద్దె ఇళ్ళే.

రిగ్24 గంటలూ నిరంతరంగా పని చేస్తుంది. రిగ్ మీద 8 గంటల చొప్పున మూడు షిఫ్టులు జరుగుతాయి. అలా షిఫ్టుల మీద వెళ్ళే సాంకేతికి బలాలు వారంరోజుల పాటు క్యాంపులో ఉండిపోయి, ఒక క్రమంలో జమ్మూ తిరిగి వచ్చేసి రెండు రోజుల తర్వాత క్యాంపుకి వెళ్లిపోతాబు. నా విభాగం పని చమురు బావి లో ప్రతి అయిదువందల మీటర్ల త్రవ్వకం జరిగిన తర్వాత, సంక్లిష్టమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలెక్ట్రికల్ కేబుళ్ళ సహాయంతో దింపి, భూమి లోపలి పొరలను గురించిన భౌతిక సమాచారం, ఉపరితల పరికరాలద్వారా గ్రాఫ్ ల రూపంలో రికార్డ్ చెయ్యబడుతుంది. అందుచేత సగటుగా నెలకో రెండు సార్లు రిగ్ సైట్ కు వెళ్లాల్సి వస్తుంది.

జమ్మూ కంటోన్ మెంట్ ఏరియాలో టైగర్ సినిమా హాల్ ఉంది. అందులో నెలలో ఓ ఆదివారం ఉదయం తెలుగు సినిమా వేస్తారు. అక్కడ చాలామంది తెలుగు ఆర్మీ ఇంజనీర్లతో,ఆఫీసర్లతోటి పరిచయం కలుగుతుంది. అయితే ఓ ఆరుగురు యువ ఆఫీసర్లతో మాకు మంచి స్నేహం కలిగింది.

తెలుగు సినిమాలేని ఆదివారం ముందు రోజు శనివారం ఫోన్ చేసి, మర్నాడు తాము మధ్యాహ్నం భోజనానికి వస్తున్నామని, లేదా సాయంకాలం టిఫిన్లకు వస్తున్నామని, పెసరట్టు ఉప్మా కావాలని, లేదా అవడలు కావాలని తమ కోరికలు వెలిబుచ్చేవారు. మేమూ, రమణమూర్తిగారనే రిగ్ ఇన్ చార్జి రిటైర్డ్ మిలటరీ ఆఫీసరైన ఓ సర్దార్జీ ఇంట్లో మేడమీద కలిసి ఉండేవాళ్లం. మా శ్రీమతులిద్దరూ ఆర్మీ స్నేహితుల కోరిన ప్రకారం వంటలు చేసేవాళ్ళు. (వాళ్ళు పిల్లలకోసం చాక్లెట్లూ, ఆడవాళ్ళకోసం కూల్ డ్రింకులూ, మా కోసం బీరు సీసాలు తెచ్చేవారు). జమ్మూ యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్ గా ఉండే డాక్టర్ కామేశ్వరరావుగారు కూడా మా ఆదివారం సమావేశాల్లో పాల్గొనేవారు. ఆదివారాలు కాలక్షేపం బాగా జరిగిపోయేది. శనాదివారాలలో వైష్ణోదేవి ఆలయం, ఇతర దగ్గర ప్రాంతాలూ స్కూటర్ల మీద వెళ్ళే వాళ్ళం. ఒకసారి మేమూ, రమణ మూర్తిగారూ, ప్రొఫెసర్ కామేశ్వరరావుగారు కుటుంబాలతో శ్రీనగర్, పహల్గామ్, గుల్మర్గ్, ఇత్యాది ప్రాంతాలు సందర్శించాం. అక్కడి దుకాణదారులు యాత్రీకుల పట్ల సక్రమంగా ప్రవర్తించినా, కావాలని భారత్ మీద విసుర్లు విసిరినవారే

శ్రీనగర్ నుంచి ఓ టూరిస్ట్ బస్ లో మా మూడు కుటుంబాల వాళ్ళం పహల్గామ్ ప్రయాణం చేశాం. దూరం సుమారు 85 కిలోమీటర్లు. కొండ దారి. శ్రీనగర్ వదిలి ఓ పది కిలోమీటర్లు దాటిన తర్వాత బస్ ఆగింది. బిలబిలమంటూ ఓ నలభైమంది దాకా పిల్లలు బస్సులో ప్రవేశించి, యాత్రీకుల్ని పక్కకి తోసి ఇరుక్కుని కూర్చున్నారు. అది నిత్యం జరిగే వ్యవహారమేనని చెప్పకనే తెలిసిపోయింది. సరే, నాపక్కన కూర్చున్న విద్యార్థిని పేరేమిటనీ, ఏ క్లాసు చదువుతున్నావనీ అడిగాను. అవి చెప్పాడు. ఊరు పేరేమిటనీ, అదెక్కడుందీ అని అడిగాను. ఊరుపేరు చెప్పి అది పాకిస్తాన్ లో ఉందన్నాడు. మరో గంటవ్యవధిలో బస్ నాలుగైదుచోట్ల ఆగింది. కొందరు దిగారు, మరికొందరు ఎక్కారు. విద్యార్థులేకాక అక్కడి ప్రయాణికులు కూడా ఎక్కి, దిగారు. నాలుగ్గంటల ప్రయాణం తర్వాత పహల్గామ్ చేరి బస్ దిగే సరికి మాకు నిజంగా నిస్సత్తువ వచ్చేసింది. ఆగిన చోటునే ఉన్న ఓ సెలఏరు పక్కన ఉన్న సిమెంట్ సోఫాల్లో కూర్చుని, కూడా తెచ్చుకున్నవి తిని, దగ్గర్లోనే పిల్లల్ని మందలిస్తూ తిరిగి, సాయంత్రం నాలుగు గంటలకి తిరుగు ప్రయాణం చేసి ఏడింటికి శ్రీనగర్ చేరుకున్నాం. ఆ మరుచటి రోజు ఉదయమే శ్రీనగర్ వదిలి జమ్మూ చేరుకోన్నాం.

1971 డిసెంబర్ ఒకటో తారీఖున మా ఆర్మీ స్నేహితులు అరుగురూ చెప్పాపెట్టకుండా వచ్చేశారు. అప్పటికప్పుడు ఉప్మాచేసి పెట్టగా తిని, "పరిస్థితులు బాగో లేవు. పాకిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతోంది. మీరు కుటుంబాలను పంపివేయడం మంచిది. యుద్ధం తప్పనిసరి అని తెలుస్తోంది. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో అని మిమ్మల్ని చూసి పోదామని వచ్చాం," అని నమస్కారాలు చేసి వెళ్ళి పోయారు. డిసెంబర్ 2వ తారీఖు సాయంత్రం ఆ అరుగురులోనే ఒకరైన సత్యనారాయణ ల్యాండ్ మైన్ బాంబులను సరిహద్దు ప్రాంతంలో అమరిక చేస్తున్న సమయంలో,...........

(సశేషం)



# కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ముడుంబై వేంకటాచార్యులు

**కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు --10వ భాగం**

వారుఅంతా అనంతాళ్వార్ ఇంటికి వెళ్ళి మీ శిష్యుడు చేత మీరు స్వామి వారి ప్రసాదం పంపారు గాన మాప్రాణాలు నిలబడ్డాయి అంటే నాకు ఇంకో శిష్యుడు కూడానా! ఏది ఏమైనా ఎవరో గాని ముందుగా మా స్వాముల ప్రాణాలు నిలబెట్టారు అదే సంతోషం అని మనస్సులో అనుకుని పరమాత్మకు ఈవిషయం తెలియజేయగా స్వామి వారు వారితో నేనే మీ శిష్యుడు గా వాళ్ళకు ప్రసాదం ,మంచినీళ్ళు అందించానని, చెప్పారు.స్వామీ అపచారం. దాసునికి తమరు శిష్యులా! అపచారం అసలు గురువు గా ఉండే ఎటువంటి అర్హతలు దాసుని కి లేవు.క్షమించమని కోరారు.

ఒక రోజు అనంతాళ్వార్ స్వామి వారి ని కలిసి నేను నా కుటుంబసభ్యులు కలసి తమకు ఒక కోనేరు ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాము అని తెలియ జేయగా స్వామి వారు అంగీకరించడం జరిగింది.అనంతాళ్వాన్ మట్టి తవ్వి తట్టలోకి ఎత్తి కడుపుతో నున్న తన భార్య నెత్తిన పెట్టి దూరంగా ఉన్న ఒక చోట గట్టు గా పోసి రమ్మన మని చెప్పగా ఆమె అలాగే చేసేది. ఆమె వెళ్ళి వచ్చేలోపు కాసేపు కూర్చుని విశ్రాంతి తీసుకునే-



వారు.అనంతాళ్వాన్ భార్య పడే కష్టం స్వామి వారు చూడ లేక ఒక బాలుడు రూపంలో అనంతాళ్వాన్ చెంతకు వెళ్ళి నేను ఉచితంగా స్వామి వారి కైంకర్యం చేసుకోవాలని ఉందని.నాకు అవకాశం కల్పించమని కోరారు.ఇది కేవలం మా కుటుంబ సభ్యులు మాత్రమే చేసుకునే కైంకర్యం.నీకు అవకాశం లేదు వేళ్ళిపొమ్మన్నారు.సరేనని ఆయనకు కనిపించ కుండా ఆయన భార్య చెంతకు వెళ్ళి అమ్మా మీరు పడే కష్టం నేను చూడ లేకుండా ఉన్నాను ఆ మట్టి తట్టనానెత్తిన పెడితే గట్టున పోసి ,వచ్చి ఆ తట్టమీకు అందిస్తా .మీరు ఆస్వామి నుండి అందుకుంటే నేను మీనుండి అందు కుంటా అంటే ఆమె సరే అంది . పని గబగబా ముందుకు సాగుతోంది.ముందు మట్టి గట్టు న పోసి వచ్చే సరికి ఆలస్యం అయ్యేది.ఇప్పుడు బాలుడు సాయం ఉన్న మీదట గబగబా వెళ్ళి వస్తోంది.ఈ విషయం తెలియని అనంతాళ్వాన్ తనభార్య తో నీలో భగవంతుని పని చేసే కొద్దీ హుషారు పెరిగి పోతోంది. అంటే ఆమె నాకష్టం చూడలేక ఒక అబ్బాయి వచ్చి సాయం చేస్తున్నాడని చెప్పింది.దాంతో "మాకైంకర్య విఘ్నకారీ" అంటూ మట్టి తవ్వే గడ్డ పార తీసుకుని బాలుడు రూపం లో నున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారిపై విసిరేశాడు.ఆగడ్డపార స్వామి గడ్డానికి తగిలి ఆలయంలోవిగ్రహ రూపంలోనున్న స్వామి గడ్డం నుండే రక్తం కారుతోంది అంత కంగారు పడుతుంటే ఇది అనంతాళ్వాన్ కైంకర్యం మీరు ఆయన్ని ఏమీ అనడానికి వీల్లేదు అన్నారు.స్వామి వారికి అనంతాళ్వాన్ గుర్తు గా గడ్డంపై మచ్చ స్వామే స్వయంగా ఏర్పాటు చేసుకున్నారు.స్వామి వారికి అనంతాళ్వాన్ అంటే అంత ఇష్టం. భగవంతునికి తన భక్తుని కన్నా తన భక్తుని భక్తుడు అంటే చాలా ఇష్టం.

ఉదా:--శ్రీరామచంద్రునికి నిత్యం సేవచేసే లక్ష్మణుని కన్నా నిరంతరం రాముని తన మనస్సులో ఉంచు కుని ఆరాధించే భరతుని కన్నా భరతుని ఆరాధించే శత్రుఘ్నుడు అంటేచాలా ఇష్టం.అని శ్రీ రామచంద్రుడే స్వయంగా తెలియజేశారు .అలాగే రామానుజుల వారి శిష్యుడు అనంతాళ్వారు అంటే వేంకటేశ్వర స్వామి వారికి చాలా ఇష్టం.

(ఇంకా ఉంది)

# అంతర్వేది

డా॥కె.రామానందం



ధవళేశ్వరం దాటి ఏడుపాయలైన గోదావరి ప్రధానశాఖ అంతర్వేది వద్ద సాగరసంగమం జరుగుతుంది. నారసింహ క్షేత్రమైన అంతర్వేది పురాణ ప్రసిద్ధమైంది. గోదావరి శివక్షేత్రం వద్ద ప్రారంభం అవుతుంది. విష్ణు క్షేత్రం వద్ద అంతమవుతుంది. అది అద్వైతం. అద్వైతం మాత్రమే గాని, అద్వైత సిద్ధాంతం కాదు.

## అంతర్వేది గాధ

ఇక్కడ వశిష్ఠ మహర్షి ఆశ్రమాన్ని ఏర్పరచుకుని నివశించాడు. అందుకే ఈ గోదావరికి 'వశిష్ఠ' అని పేరు. వశిష్ఠుని ధర్మపత్ని అరుంధతి. ఆమె పతివ్రతాయోగిని. వంద సంవత్సరాలు భర్తను సేవించింది. అరుంధతి తన ధర్మమును సంపూర్ణముగ మనసా వాచా కర్మణా నిరూపించి, నక్షత్ర మండలం స్థానం సంపాదించుకుంది. వివాహాలలో వధూవరులకు అరుంధతీ నక్షత్రాన్ని దర్శింపజేస్తారు. వధూవరుల దంపతులుగా అరుంధతీ వశిష్ఠుల వలె అన్యోన్యంగా అద్వైతంగా ఉండాలనేది లక్ష్యం`ఆదర్శం`ఆశీస్సు అరుంధతీ వశిష్ఠలు వివాహానంతరం, నూతన దంపతులు కాపురం చేసిన పుణ్యస్థలి` ఇదే అంతర్వేదిలో మొదట బ్రహ్మ రుద్రయాగం నిర్వహించాడు. ఈ క్షేత్రంలోని పార్వతీ నీలకంఠ స్వామి వారిని బ్రహ్మగారే ప్రతిష్ఠ చేశారు. ఇది కాక బ్రహ్మ యాగవేదిక కనుక అంతర్వేది (అంతర్ G వేదిక) అని క్షేత్రానికి పేరు వచ్చిందని తెలుస్తుంది.

ఒకసారి వశిష్ఠునికి విశ్వామిత్రునికి యుద్ధం సంభవించింది. వశిష్ఠునిపై యుద్ధం చేయుటకు విశ్వామిత్రుడు, హిరణ్యకశిపుని కుమారుడైన రక్తలోచనుని పంపించాడు. ఈయన శివుని కొరకు తపస్సు గావించి వరం పొందాడు. శరీరం నుంచి పడిన రక్తపు బిందువులు ఇసుక మీద పడితే ఆ ఇసుక రేణువుల నుంచి బలవంతులైన అనేక మంది రక్తలోచనలు ఉద్భ-



విస్తారు. అట్టి వరం పొందిన రక్తలోచనడు వర గర్వంతో, ధ్వంస రచన సాగిస్తూ వినాశనాన్ని సృష్టిస్తున్నాడు. అట్టి వర గర్వాంధుడు వశిష్టునిపై దండయాత్రకు సిద్ధమైనాడు. వశిష్టుడు తన దివ్యశక్తితో సకలం తెలుసుకున్నాడు. తన కామధేనువును అర్ధించి రక్తలోచనుని సేనను జయించగల వీరులను సృష్టించమన్నాడు. సేన సిద్ధమయింది. అయితే రక్తలోచనుడు బీభత్సం చేసి వశిష్టుడి నూరుగురు పుత్రులను సంహరించాడు. అప్పుడు వశిష్ఠుడు లక్ష్మీ నరసింహ స్వామిని ప్రార్థించగా నరహరి అవతారంలో రక్తలోచనుడిని సంహరించడానికి ఏతెంచి, రక్తలోచనని శరీరం నుంచి రక్తం నేలపై పడకుండ స్వామి సోదరి అశ్వరూప తన నాలుకవంచింది. రాక్షసుల రక్తమంతా చేరి 'రక్త కుల్య' నదిగా ప్రవహించింది. రక్తలోచనడు వధించబడ్డాడు. విశ్వామిత్రుని అహంకారం ఓడిరది. వశిష్టుడు స్వామి మరియు ఆయన సోదరి సహాయంతో విజయుడౌతాడు.

వశిష్ఠుడు అభ్యర్థన మేరకు లక్ష్మీనరసింహస్వామి అక్కడే స్థిరపడినారు. యుగాలుగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. లక్ష్మీ నరసింహ ఆలయానికి ఒక కిలోమీటరు దూరంలో స్వామి సోదరి అశ్వారూఢ `గుర్రాలక్క ఆలయం ఉంది. ఈ అశ్వారూఢ అమ్మవారి ఆలయానికి, స్వామివారు ప్రతి సంవత్సరం ఒకసారి వేంచేసి, తన సోదరికి నూతన వస్త్రాలను ఇచ్చి వస్తారు.

శ్రీరాముడు, రావణ వధానంతరం అంతర్వేది క్షేత్రాన్ని దర్శించినట్లు స్థలపురాణం చెబుతుంది. ఈ క్షేత్రాన్ని శ్రీనాథుడు రచించిన భీమఖండంలోను, శ్రీనారాయణ తీర్థుల కీర్తనలలోను అంతర్వేది నృసింహుని ప్రసక్తి ఉంది. చేమకూర వెంకట కవి రచించిన విజయవిలాసంలో అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ అంతర్వేదిని దర్శించినట్లు ఉదాహరింపబడిరది.

అంతర్వేది ఆలయాన్ని పల్లవులు పునర్నిర్మించారు. ప్రస్తుత ఆలయం వయసు 300 ఏళ్లు పైబడినట్లు తెలుస్తుంది. ఆలయ జీర్ణోద్ధరణకు పాటుబడిన వారు పెద్దాపురపు జమీందారులు కుటుంబీకుడు శ్రీ కోపనాతి కృష్ణమ్మగారు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాన్ని ఆలయ ముఖద్వారం ముందు ఉంచారు. ఆగమశాస్త్రానుసారం ఆలయాన్ని రెండు అంతస్తులుగా నిర్మించారు. ప్రాకార సైతం రెండస్తుల నిర్మాణంగా నిర్మించారు. ఆలయానికి దూరంగా వశిష్టనదికి దగ్గరగా విశాలమైన ఖాళీ ప్రదేశంలో కళ్యాణ మండపం ఉంది. అక్కడనే నృశింహుని కళ్యాణాన్ని భక్తులు తిలకిస్తారు. మాఘమాసంలో కొద్ది రోజులపాటు సూర్యకిరణాలు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి పాదాలను తాకుతుంటాయి.

ఆలయ ప్రధాన దైవం పశ్చిమాభిముఖుడై భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఆయన తన వీరత్వానికి చిహ్నంగా కోరమీసాలతో కానవస్తాడు. ఆయన గర్భాలయంలో నృసింహస్వామితో పాటు, శ్రీహరి అవతారమైన శ్రీకూర్మం సాలిగ్రామ శిలా మూర్తిగా పూజలనందుకుంటుంది. భక్తులు అభిషేక సమయంలో శ్రీకూర్మ సాలిగ్రామాన్ని దర్శించవచ్చును. స్వామివారి దేవేరి రాజ్యలక్ష్మి తాయారు అంతరాలయంలో దర్శనమిస్తారు. ఈ ఆలయంలో అనేక ఉపాలయాలను దర్శించవచ్చును. గరుడాళ్వార్, ఆంజనేయస్వామి, కేశవస్వామి, సంతాన వేణుగోపాలస్వామి, కోదండ రామాలయం వంటివి ప్రధాన ఉపాలయాలు. శ్రీకూర్మ సాలగ్రామమూర్తి వారు ఇచ్చట పూజలు అందుకొనుటకు ఒక

కారణం ఉందని చెబుతారు. పూర్వం రక్త కుల్యా నదిలో ఒక బేస్తావాడు వేసిన వలలో పదేపదే వస్తున్న రాయిని చూసి కోపంగా నేల కేసి కొట్టగా దానినుంచి రక్తంవచ్చింది. ఆ శిల కూర్మసాలి గ్రామం అని, అంతర్వేది ఆలయంలో నృసింహునితో బాటు అభిషేకాలు జరిపించమని ఆకాశవాణి ద్వారా తెలియవచ్చింది. అందువల్లనే కూర్మసాలిగ్రామం స్వామివారితో బాటు, గర్భాలయంలో పూజలు అందుకొంటుంది.

అంతర్వేది నృశింహక్షేత్రంలో నృశింహ జయంతి, శ్రీరామనవమి మరియు వైష్ణవ పర్వదినముల యందు ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తుంటారు. భక్తుల నిమిత్తం ఆలయంలో అనేక అర్చనలు అనగా అభిషేకం, అష్టోత్తరం, సహస్రనామ పూజ, సుదర్శన హోమం వగైరా 14 సేవలను భక్తులు నిత్యం ఆర్జిత సేవలుగా నిర్వహిస్తారు. ఈ పుణ్యస్థలి సాగర తీరంలో ఉన్నందున ఆషాడ, కార్తీక, మాఘ, వైశాఖమాసాల్లో పౌర్ణమి రోజున సముద్ర స్నానం చేసి, అశేష సంఖ్యలో నృశింహస్వామి ఆలయాని దర్శించుకొని పునీతులవుతారు. మాఘమాసంలో శుద్ధ సప్తమి నుంచి బహుళ పాఢ్యమి వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా జరుపుతారు. ఈ వేడుకలలో పాల్గొనేందుకు కోనసీమ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొనటం ఒక అలవాటు. కారణం అంతర్వేది నరసింహుని రథోత్సవం వీక్షించిన వారికి పునర్జన్మ ఉండదట. బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు రథోత్సవం నిర్వహిస్తారు.

ఇదే మాసం, అనగా మాఘ మాసంలో మాఘశుద్ధ దశమినాడు స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా ఆలయ అధికారులు నిర్వహిస్తారు. ఈ వేడుకలో పాల్గొనుటకు జిల్లాలోని పెద్దలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర మంత్రులు అందరూ వస్తారు. స్వామి అమ్మవార్లకు పెద్దాపురం సంస్థానాధీశులు సమర్పించిన కిరీటం, మొహరీల దండ, పచ్చల పతకం తదితర ఆభరణాలతో అలంకరిస్తారు. విశాలమైన ఖాళీ ప్రదేశంలో వేలాది మంది కల్యాణాన్ని తిలకించే విధంగా నూతనంగా నిర్మించిన మండపాలలో ఆలయ అర్చకులు కల్యాణం జరుపుతారు. కల్యాణం జరిగిన మరుసటి రోజు అనగా ఏకాదశి రోజున స్వామివారిని, వారి ఉభయ దేవర్లను ఊరేగించటం కాక, రథాన్ని గుర్రాలక్క (స్వామి వారి సోదరి అశ్వారూఢాంబిక) ఆలయం వరకు తీసుకువెడతారు. అచ్చట స్వామివారు తన సోదరికి చీర సారె పెట్టించే సన్నివేశాన్ని చూచి ఆనందిస్తారు. నాటి ఆలయ సందర్శకులందరూ, క్రమశిక్షణతో, స్త్రీలు పురుషులు రథాన్ని లాగి పరంధాముని దయకు పాత్రులౌతారు. ఇంకో విశేషం! స్వామి వారి కళ్యాణం అయిన పిమ్మటనే, ఈ ప్రాంతవాసులు పెండ్లి ముహూర్తాలు పెట్టించుకోవడం ఒక అలవాటయింది.

అంతర్వేది వద్దనే సముద్రంలో వశిష్ట గోదావరి సంగమిస్తుంది. సంగమ ప్రాంతంలో భక్తులు స్థానాధికాదులు చేసి దానధర్మాలు చేసి పునీతులవుతారు వశిష్ట గోదావరి సముద్రంలో కలిసే చోటు అపురూపంగా కానవస్తుంది. సముద్రం నీటి రంగు, గోదావరి నీటి రంగు వేరువేరుగా ఉంటాయి. ఒకవైపు స్వచ్ఛంగా మరొకవైపు మట్టిగా కనిపిస్తుంది. సముద్ర ఆటుపోట్లు వచ్చినప్పుడు కూడా నీటి రంగులు మారవు. త్రికోణాకారంగా ఉన్న లంకలో ఈ ప్రధాన ఆలయంతో పాటు యాత్రికులు 1. వశిష్ట ఆశ్రమం 2. నీలకంఠేశ్వర స్వామి ఆలయం 3. గుర్రాలక్క గుడి 4. సాగర తీరం 5. సంగమ స్థలాలను చూచి తమ కష్టాలను గట్టెక్కించమని మనసార వేడుకొంటారు.

# చైతన్యరూపిణియే అమ్మ

డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాదరావు.

నాగం అనే వాయువు ముక్కులో ఉంటుంది . కూర్మం కంటి రెప్పలలో ఉంటుంది. కృకరం నేత్రవలయంలోను , దేవదత్తం కంఠద్వారమందు, ధనంజయం శరీరమంతటను నిండి ఉంటాయి. ఇక ఉపవాయువుల మాటకొస్తే 'నాగం' వాంతి మొ|| వాటికి కారణం అవుతుంది . 'కూర్మం' కనురెప్పలు తెరుచుకోవడం, మూసుకోవడం మొదలైన పనులకు తోట్పడుతుంది. 'కృకరం' ఆకలి, దప్పికలను అదుపులో ఉంచుతుంది. 'దేవదత్తం' అనే వాయువు ఆవులింత మొదలైన వాటికి కారణం అవుతుంది . 'ధనంజయం' శరీరానికి పోషకంగా ఉండి కాంతిని చేకూరుస్తుంది. ఈ 'ధనంజయం' అనే వాయువు మనిషి మరణించిన తరువాత కూడ మృత కళేబరానికి స్నానం చేయించే వరకు శరీరాన్నే అంటి పెట్టుకుని ఉంటుందని చెపుతారు. అందుకే స్నానం చేయించాకనే దహనసంస్కారాలు నెరవేరుస్తారు.

మూడోది మనోమయకోశం: ఇది ఐదు జ్ఞానేంద్రియాలతోను, ఐదు కర్మేంద్రియాలతోను, మనసుతోను కలసి ఏర్పడుతుంది. చర్మం , కన్ను , ముక్కు, చెవి, నాలుక, అనేవి జ్ఞానేంద్రియాలు, ఎందుకంటే మనం వీటి ద్వారానే జ్ఞానం సంపాదిస్తాం. కాలు, చేయి, నోరు, జననేంద్రియం, విసర్జనేంద్రియం, అనే ఈ ఐదు కర్మేంద్రియాలు . ఈ పది మనసుతో కలసి మనోమయకోశంగా ఏర్పడతాయి.

నాలుగోది విజ్ఞానమయకోశం: ఇది ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు బుద్ధితో కలిసి ఏర్పడుతుంది . ఇది మనోమయకోశం లోపల ఉంటుంది .

ఐదోది ఆనందమయ కోశం : 'విజ్ఞానమయకోశం' లోపల 'ఆనందమయకోశం' ఉంటుంది. ఈ ఆనందమయకోశంలో మనిషి పూర్వజన్మలో చేసిన కర్మలన్నీ సంస్కారరూపంలో ఉంటాయి. ఇక అన్నమయకోశంకంటే ప్రాణమయకోశం , ప్రాణమయకోశంకంటే మనోమయకోశం, మనోమయకోశంకంటే విజ్ఞానమయకోశం, విజ్ఞానమయకోశంకంటే ఆనందమయకోశం సూక్ష్మమైనవి, ప్రియమైనవికూడ. ఉదాహరణకి మనం అన్నంకోసం పొట్టచేతపుచ్చుకుని తిరుగుతాం. ఎక్కడ ఉద్యోగమొస్తే అక్కడకు పోతాం. కాని అక్కడ ప్రాణానికి ముప్పువచ్చే పరిస్థితి ఎదురైతే ప్రాణంకోసం అన్నాన్ని విడిచిపెట్టేస్తాం. దీన్నిబట్టి అన్నంకంటే ప్రాణం ముఖ్యమని తెలుస్తోంది. అలాగే ఎప్పుడైనా మన మనస్సుకు గాని, అభిమానానికి గాని ముప్పు వాటిల్లితే ప్రాణం విడిచి పెట్టడానికైనా సిద్ధ పడతాం గాని మనస్సును సమాధానపరచం. దీన్ని బట్టి ప్రాణం కంటే మనస్సు గొప్పదని తెలుస్తోంది. ఒక్కొక్కప్పుడు మనం విజ్ఞానంకోసం మనస్సు చంపుకుని ఎన్ని అవమానాలైనా భరిస్తాం. గురువు ఎన్ని తిట్టినా ఎంత కొట్టినా ఓర్చుకుంటాం. ఎందుకు? విజ్ఞానం కోసం. దీన్నిబట్టి మనోమయకోశం కన్నా విజ్ఞానమయకోశం గొప్పదని తెలుస్తోంది. ఇక ఆనందం కోసం అన్ని విడిచిపెట్టేస్తాం . ఎందుకంటే అదే జీవిత పరమావధి. దీన్నిబట్టి ఆనందమయకోశం అన్నిటికన్న గొప్పదని తెలుస్తోంది. ఈ ఆనందమయకోశం ఆత్మకు చాల దగ్గరలో ఉండడం వల్ల ఆనందమయకోశాన్నే ఆత్మగా భ్రమించే అవకాశం కూడ ఉంది.

ఇక అన్నమయకోశమే స్థూలశరీరం. ప్రాణ, మనో, విజ్ఞానమయ కోశాలు సూక్ష్మశరీరం. ఈ సూక్ష్మశరీరాన్నే యాతనాశరీరం అని కూడ పిలుస్తారు. ఇది మనిషి మరణించిన తరువాత స్వర్గ, నరకాదులు చేరుకొని పుణ్య, పాప

ఫలాలను అనుభవిస్తుంది. ఇక ఆనందమయకోశమే కారణశరీరం. శివుణ్ణి మనం 'త్రిపురాంతకుడు' అని పిలుస్తాం . పురము అంటే శరీరం . పురి శేతే ఇతి పురుష: అంటే ఆత్మ అని అర్థం. మొత్తం మీద ఈ మూడు శరీరాలకు అతీతుడైన 'పరమాత్మ' అని అంతరార్థం .

ఇక స్థూలశరీరం 'జాగ్రదవస్థ' అంటే మెళుకువ లోను; సూక్ష్మశరీరం 'స్వప్నావస్థ' అంటే కలలోను; కారణశరీరం 'సుషుప్త్యవస్థ' అంటే గాఢనిద్రలోను మనకు అనుభవగోచరమౌతాయి. సాధారణంగా ఆరోగ్యవంతుడైన మనిషి ఈ మూడు అవస్థలు పొందుతూ ఉంటాడు . అవి జాగ్రత్తు, స్వప్నం , సుషుప్తి . ఇవి కాకుండా మూర్ఛ , అపస్మారం వంటి అవస్థలు కూడ ఉంటాయి అవి రోగులకు మాత్రమె వర్తిస్తాయి . ఆత్మ జాగ్రదవస్థలో విశ్వ అనే పేరుతో వ్యవహరింపబడుతుంది.

ఒక వ్యక్తిని ఇంట్లో పిల్లలు నాన్న అంటారు. ఆయనే ఆఫీసుకు వెడితే sir అని పిలుస్తారు, ప్లే గ్రౌండ్ కి వెళితే స్నేహితులు ఒరేయ్ అని పిలుస్తారు . ఈ మూడు పిలుపులు ఒకనికి సంబంధించినవే . అలాగే మెళుకువలో ఆత్మను విశ్వుడు' అంటారు . ఆయన స్థూలభుక్. Gross enjoyer. స్థూలమైన వస్తువులను పందొమ్మిది నోళ్ళతో అనుభావిస్తాడు. అవి పంచ జ్ఞానేంద్రియాలు , పంచ కర్మేంద్రియాలు , పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి, అహంకారం , చిత్తం అనేవి . అది ఈ పందొమ్మిది ముఖాలతో అన్నీ అనుభవిస్తాడు.

ఆ తరువాత నిద్రలో మనకు కల వస్తుంది అనుకుందాం. కలలో ఆత్మను 'తైజసుడు ' అని పిలుస్తారు . అది సూక్ష్మభుక్ . subtle enjoyer. అవే పందొమ్మిది ముఖాలతో సుక్ష్మమైన వాటిని అనుభవిస్తాడు. ఆ అనుభవం చాల సూక్ష్మమైనది. ఉదాహరణకు మనం కలలో ఒక apple పండు తిన్నామనుకోండి. నిజమైన apple తింటే ఏ అను భూతి కలుగుతుందో అదే అనుభూతి కలుగుతుంది . సైకిలు మీద నుండి పడి, కాలు విరిగితే ఏ బాధ కలుగుతుందో అదే బాధ కలలో కూడ కలుగుతుంది . కాని అది సూక్ష్మమైన అనుభూతి . ఆ తరువాత అవస్థ గాఢసుషుప్తి అంటే నిద్ర . ఆ స్థితిలో ఆత్మను ప్రాజ్ఞుడదని అని పిలుస్తారు . ప్రాజ్ఞ అనే పదానికి అన్నీ తెలిసిన అని ఏమీ తెలియని అని ముఖ్యంగా రెండు అర్థాలున్నాయి. 'ప్రకర్షేణ ఆ సమంతాత్ జానాతి' అనగా అన్నీ తెలిసినవాడు అని ప్ర,అజ్ఞ: ఏమీ తెలియని వాడని రెండు అర్థాలున్నాయి . ఈ స్థితిలో జీవుడు ఏకోన్ముఖుడై ఆనందమయుడై ఉంటాడు. అక్కడ సుఖదు:ఖాలు లేవు, కేవలం ఆనందమే ఉంది . ఇక్కడ సుక్ష్మం గా ఆలోచిస్తే ఒకటి తెలుస్తుంది. జాగ్రత్తులోను, స్వప్నంలోనూ సుఖం దు:ఖం, రెండు ఉన్నాయి . సుషుప్తిలో ఆనందం మాత్రమె ఉంది . అదే మన నిజ స్వరూపం . మిగిలినవి రెండు తెచ్చి పెట్టుకొన్నవే.

ఇక ఈ మూడు స్థితులు రోజు మనకు వస్తూ పోతూ ఉంటాయి . అందుకే 'నేను మెలుకువగా ఉన్నాను' , నేను కలలో ఏవేవో చూశాను , నేను హాయిగా ఆనందంగా నిద్రపోయాను, నాకేమీ తెలియలేదు అని మెలకువ వచ్చాక మనం చెప్పగలుగుతున్నాం.

ఆత్మలో ఇవన్నీ వస్తూ, పోతూ ఉంటాయి . ఆత్మకు వీటితో సంబంధం లేదు.

ఆత్మస్వరూపం ఈ మూడిటి కంటే అతీతమైంది, వీటికి ఆధారభూతమైనది. కాని వీటికంటే భిన్నమైననాలుగోది మాత్రం కాదు. ఈ మూడిటిని తొలగిస్తే మిగిలియున్నదే అది . ఉదాహరణకు ఒక గోడమీద మూడు రంగులు పులుముతామనుకుందాం. ఆ మూడు రంగులు చెరిపివేస్తే మిగిలేదే నాలుగోది . అదే తురీయం, అంటే నాలుగోది . అదే మన స్వరూపం.

ఇక చక్రాల మాటకొస్తే మన శరీరంలో ఆరు చక్రాలు ఉన్నాయి. మొదటిది మూలాధారం . దీన్ని గుదాచక్రం అంటారు. రెండోది స్వాధిష్ఠానం . దీన్ని ఇంద్రియచక్రం అంటారు. మూడోది మణిపూరకం . ఇదే నాభిచక్రం . నాలుగోది అనాహతం . దీన్ని హృదయచక్రం అంటారు.

ఐదోది కంఠచక్రం. దీన్ని విశుద్ధము అని పిలుస్తారు .

(ఇంకా ఉంది)

# విద్యానుబంధం

మాదిరాజు వాణి

విద్యకు పరమార్థాలు చాలా ఉన్నాయి. విద్యాధికునకు విద్య తనపై తనకుగల విశ్వాసాన్ని ప్రజకు తెలియజేయటానికి దోహద పడుతుంది. ఒక వ్యక్తి తన జీవిత మార్గాన్ని, లక్ష్యాన్ని ఏర్పరచుకోవటానికి, తన సామర్థ్యమెంతో తెలియ పరచటానికి, సమాజానికి తానెంత ఉపయోగ పడతాడో తెలియజెప్పటానికి విద్య ఉపయోగ పడుతుంది. ఇవి విద్యకున్న ప్రయోజనాల్లో కొన్నిమాత్రమే. అన్నిటికి మించి విద్య వల్ల వ్యక్తిత్వ నిర్మాణ మేర్పడుతుంది. ఇదే శీలం. శీలమే అద్భుతమైన జాతీయ జీవితంగా వివేకానందుడు అభివర్ణించాడు.

మానవునకు విద్య నేర్పటానికి మానవునకే సాధ్యమవుతుంది కాని భగవంతునకు కూడా సాధ్యం కాదు. విద్య నేర్పే మానవుడే గురువయ్యాడు. గురుస్థానం ఎంతో ఉన్నత మైంది. గురువు లక్షణాలు, నిర్వచనాలు వేద శాస్త్ర పురాణేతిహాసాల్లో అనేకాలు లభిస్తాయి. అభిలాష గల గురువులు, విద్యార్థులు తప్పని సరిగా వాటిని మననం చేసుకోవలసిన అవసరముంది.

గురువనే వాడు మొదటగా తన స్థితి, సమర్థతను అంచనా వేసుకో గలగాలి. గెలుపోటముల అంశాలను సమానంగా దర్శించే నేర్పు కలిగుండటం-సమాజానికి దిశానిర్దేశం చేయగలగటం-సృజనాత్మకమైన ఆలోచనలను కలిగి ఉండటం వ్యక్తిసామర్థ్యాన్ని గుర్తించి జీవితానికొక లక్ష్యాన్ని అందించే ఒక నిర్దిష్ట ప్రణాళిక నేర్పరుచుకోగలగటం- గురుత్వాన్ని పరాకాష్ఠకు తీసుకొని వెళ్లే అంశాలు. ప్రస్తుతం గురువు దేశికుడు, ఉపాధ్యాయుడు, ఉపన్యాసకుడు, చదువరి(Reader), ఆచార్యుడు(professor) అనేకాలైన పేర్లతో వ్యవహరింబడుతున్నా-అందరి లక్షణాలు ఒక్కటే. దేశికుడు సత్ సంప్రదాయ సిద్ధి కలిగి- సుస్థిర జ్ఞానంతోపాటు పాపరహితునిగాను ఉండటం, శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠ కలవాడై ఉండటం, సత్యవాకు, సమయనియమం, సాధు ప్రవృత్తికలవాడై ఉండటం, దంభం, అసూయాదులు లేకుండా ఉండటం, కోరికలను జయించి ఉండటం, దీర్ఘబంధువై, దయాళువై ఉండటం, స్వపర భేదరహితునిగా ఉండటం-దేశికుని లక్షణాలు. ఇంతటి నియమబద్ధులైన గురువులు నేటి సమాజంలో ఎందరు కనిపిస్తారు. నేడు గురు పరంపర విచ్ఛిన్నమైంది. గురువులు సూచక, బోధక, నిషిద్ధ, విహిత, కారణ, వైదిక, కామ్యక భేదాలతోనుమరల బోధక గురువులలో-నాద, ఛాయానిధి, చందన, క్రౌంచక, వాచక, పరమ గురువులు భిన్న విధాలుగా కనిపిస్తారు. ఇంకా కారణ, నిజ మౌన, సద్గురువులు కూడా దర్శనమిస్తారు. సామాజిక ప్రాథమ్యాలను బట్టి విద్యాసముపార్జన స్థితి మారింది. ఆధ్యాత్మిక-నైతిక

బోధనలకు విద్యాలయాలు కొంత దూరం జరిగాయి. శస్త్రవిద్య(లౌకిక), శాస్త్ర(బుద్ధి) విద్య-ఈరెంటిలో ఏదిగొప్పది అనే చర్చ జరిగింది. శస్త్రవిద్య మనిషికి యౌవనం ఉన్నంత వరకే రాణిస్తుంది. శాస్త్రవిద్య యౌవన, వృద్ధత్వాలలో కూడా రాణిస్తుంది. ఇప్పుడు శాస్త్ర విద్య కన్నా శస్త్ర విద్యకే అధిక ప్రాధాన్యం లభిస్తున్నది. ఇప్పటి వరకు వస్తున్న గురు శిష్యుల ముఖాముఖి విద్యాబోధనకు కూడా అంతరాయం కలగబోతున్నది. వీడియో ఎడ్యుకేషన్-వీడియో చాటింగ్-ఇ-మెయిల్ ఎడ్యుకేషన్-ఇవన్నీ ప్రసిద్ధమయ్యాయి. ఇంకా ప్రసిద్ధం కాబోతున్నాయి. అప్పుడు విద్యార్థులొకచోట-గురువు మరోచోట. కొంత కాలానికి 'శౌనకాదులకు సూతుండిట్లనియె' అనే దానికి ఎంతో వివరణ ఇవ్వవలసి యుంటుంది. వారెవరు-ఎక్కడ

విద్యకు పరమార్థాలు చాలా ఉన్నాయి. విద్యాధికునకు విద్య తనపై తనకుగల విశ్వాసాన్ని ప్రజకు తెలియజేయటానికి దోహద పడుతుంది. ఒక వ్యక్తి తన

జానికి తానెంత ఉపయోగ ఉపయోగ పడతాడో తెలియ-జెప్పటానికి విద్య ఉపయోగ పడుతుంది. ఇవి విద్యకున్న ప్రయోజనాల్లో కొన్నిమాత్రమే. అన్నిటికి మించి విద్య వల్ల వ్య-క్తిత్వ నిర్మాణ మేర్పడుతుంది. ఇదే శీలం. శీలమే అద్భుతమైన జాతీయ జీవితంగా వివేకానం-దుడు అభివర్ణించాడు.

మానవునకు విద్య నేర్పటాని-కి మానవునకే సాధ్యమవుతుంది కాని భగవంతునకు కూడా సాధ్యం కాదు. విద్య నేర్పే మానవుడే గు-రువయ్యాడు. గురుస్థానం ఎంతో ఉన్నత మైంది. గురువు లక్షణా-లు, నిర్వచనాలు వేద శాస్త్ర పురా-ణేతిహాసాల్లో అనేకాలు లభిస్తా-యి. అభిలాష గల గురువులు, విద్యార్థులు తప్పని సరిగా వాటిని మననం చేసుకోవలసిన అవస-రముంది.

గురువనే వాడు మొదటగా తన స్థితి, సమర్థతను అంచనా వేసుకో గలగాలి. గెలుపోటముల అంశాలను సమానంగా దర్శించే నేర్పు కలిగుండటం-సమాజా-నికి దిశానిర్దేశం చేయగలగటం-సృజనాత్మకమైన ఆలోచనలను కలిగి ఉండటం వ్యక్తిసామర్థ్యాన్ని గుర్తించి జీవితానికొక లక్ష్యాన్ని అందించే ఒక నిర్దిష్ట ప్రణాళిక నేర్పరుచుకోగలగటం- గురు-త్వాన్ని పరాకాష్ఠకు తీసుకొని వెళ్లే అంశాలు. ప్రస్తుతం గురువు దేశికుడు, ఉపాధ్యాయుడు, ఉప-న్యాసకుడు, చదువరి(Reader), ఆచార్యుడు(professor) అనేకా-లైన పేర్లతో వ్యవహరింబడుతు-న్నా-అందరి లక్షణాలు ఒక్కటే. దేశికుడు సత్ సంప్రదాయ సిద్ధి కలిగి- సుస్థిర జ్ఞానంతోపాటు పాపరహితునిగాను ఉండటం, శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠ కలవాడై ఉండటం, సత్యవాకు, సమయ-నియమం, సాధు ప్రవృత్తికలవాడై ఉండటం, దంభం, అసూయా-దులు లేకుండా ఉండటం, కోరి-కలను జయించి ఉండటం, దీర్ఘ-బంధువై, దయాళువై ఉండటం, స్వపర భేదరహితునిగా ఉండ-టం-దేశికుని లక్షణాలు. ఇంతటి నియమబద్ధులైన గురువులు నేటి సమాజంలో ఎందరు కని-పిస్తారు. నేడు గురు పరంపర వి-చ్ఛిన్నమైంది. గురువులు సూచక, బోధక, నిషిద్ధ, విహిత, కారణ, వైదిక, కామ్యక భేదాలతోను-మరల బోధక గురువులలో-నాద, ఛాయానిధి, చందన, క్రౌంచక, వాచక, పరమ గురువులు భిన్న విధాలుగా కనిపిస్తారు. ఇంకా కారణ, నిజ మౌన, సద్గురువులు కూడా దర్శనమిస్తారు. సామాజిక ప్రాధమ్యాలను బట్టి విద్యానము-పార్జన స్థితి మారింది. ఆధ్యాత్మిక-నైతిక

బోధనలకు విద్యాలయాలు కొంత దూరం జరిగాయి. శస్త్రవిద్య(లౌ-కిక), శాస్త్ర(బుద్ధి) విద్య-ఈరెం-టిలో ఏదిగొప్పది అనే చర్చ జరిగింది. శస్త్రవిద్య మనిషికి యౌవనం ఉన్నంత వరకే రా-ణిస్తుంది. శాస్త్రవిద్య యౌవన, వృద్ధత్వాలలో కూడా రాణిస్తుం-ది. ఇప్పుడు శాస్త్ర విద్య కన్నా శస్త్ర విద్యకే అధిక ప్రాధాన్యం లభిస్తు-న్నది. ఇప్పటి వరకు వస్తున్న గురు శిష్యుల ముఖాముఖి విద్యాబోధ-నకు కూడా అంతరాయం కలగ-బోతున్నది. వీడియో ఎడ్యుకేష-న్-వీడియోచాటింగ్-ఇ-మెయిల్ ఎడ్యుకేషన్-ఇవన్నీ ప్రసిద్ధమ-య్యాయి. ఇంకా ప్రసిద్ధం కాబో-తున్నాయి. అప్పుడు విద్యార్థులో-కచోట-గురువు మరోచోట. కొంత కాలానికి 'శౌనకాదులకు సూ-తుండిట్లనియె' అనే దానికి ఎంతో వివరణ ఇవ్వవలసి యుంటుంది. వారెవరు-ఎక్కడ కూర్చున్నా-రు.శిష్యుని సందేహాలకు గు-రువెట్లా సమాధానా లిచ్చాడు. ఇవన్నీ ఎంతగానో వివరిస్తే గాని తరువాతి తరాలకర్థం గావు. ఆశ్ర-మాల్లో, మహారణ్యాలలో జరిగే విద్యాబోధన పట్టణాలకు, పల్లెల-కు వచ్చేసింది. అనేక సౌకర్యాలు వచ్చాయి. ఇది శుభపరిణామమే. కొన్ని కార్పొరేట్ కళాశాలలు బోధన సౌకర్యాల విషయంలో వెట్టి-వేషాలు వేస్తున్నాయి. ఒకచోట తిరుపతి కవులు-

"బెంచీలక్కర లేదు-గేమ్సు మొదలౌ ఫీజుల్ వినన్ రావు పొ మ్మంచున్ నిర్ధనుద్రోసి పుచ్చరు గురుల్-ప్యాసైననే లాభ మిం దంచున్నేమము లేదు-మీచదు-వునందాలోక మీలోకమున్ గాంచన్వచ్చెడి నార్యులార! మొ-క్కంజెల్లు నెక్కాలమున్" అంటూ ఫీజులు వసూలు చేయటం, ని

ర్థనులకు చదువు చెప్పక పోవటం వంటి పాశ్చాత్య సంస్కృతీ ప్రభావాలు భారతీయ విద్యావ్యవస్థపై పడిన విధానాన్ని దుయ్యబట్టారు. అసామాన్య ప్రతిభావంతుడైన గురువు శిష్యుని శాసిస్తూ విద్యనునేర్పుతాడు. గురు శాసనానికి లొంగి శిష్యుడు ప్రవర్తిస్తూ కట్టుబాట్లకు లొంగి విద్యనార్జించాలి. గురువునకు శిష్యునిపై అభిమానం, అనురాగం ఉండాలి. గురి లేనిదే గురుత్వం రాదు. శిష్యునకు కూడా గురువుపై గౌరవముండాలి. గురువు తాను నేర్చినదంతా ఒకే విధంగా శిష్యులకు చెపుతాడు. విద్యనాకళింపు చేసుకొని తనకు పనికి వచ్చే దానిని గ్రహించి-తన జీవితానికి అనుగుణంగా మలచుకోవటం శిష్యుల విధి. ఒకసారి ఔరంగజేబు చక్రవర్తికి చిన్నప్పుడు విద్య నేర్పిన ఉపాధ్యాయుడు ఉత్తరం వ్రాస్తూ 'తమకు విద్యనేర్పినందులకు సాయం చేయ' మని కోరాడు. దానికి ఔరంగజేబు 'తనకు పనికి మాలిన విద్య నేర్పినందులకు మొదట మీకేం శిక్ష వేయాలో తెలప'మన్నాడు. దేశాధ్యక్ష పదవి కన్నా ఉపాధ్యాయ పదవే గొప్పదని భావించే అబ్దుల్ కలాంను ఒక బాలిక 'చిన్నతనంలో ఎంతోకష్టపడి శాస్త్రవేత్త, ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అయ్యారు కదా! మీవిజయానికి కారణం అదృష్టమా' అని అడిగింది. అందుకు కలాం 'అవును నిజమే నాకు చిన్నతనంలో మంచిగురువులు దొరకటం అదృష్టంకదా!' అని అన్నాడు. ఈ ఇద్దరు శిష్యులకు ఎంత తేడా!

పూర్వం రాజులైనా, మహరాజులైనా గురుకులానికి పోయి విద్య నేర్చుకొనేవారు. విద్య సంపూర్ణంగా అభ్యసించిన తరువాత గురువు అనుజ్ఞయైతేనే గాని శిష్యుడు ఆశ్రమాన్ని వదలి వెళ్లే వీలు లేదు. విశ్వామిత్రుని వద్ద విద్యపూర్తియైన తరువాతనే రామలక్ష్మణులు వివాహమాడారు. విద్యకై లోకాంతరయానం చేయటం కచుని విషయంలోను; సద్విద్యకై తండ్రి నెదిరించటం ప్రహ్లాదుని విషయంలోను చూడ వచ్చు.ఇవన్నీ భారతీయ విద్యాపరిణామ సిద్ధాంతాలు. విష్ణుశర్మ పంచతంత్ర బోధనతో మూర్ఖ శిష్యులను దేశ పాలకులను చేయటం భారతీయ విద్యకు పరాకాష్ఠ.

ప్రతిభావంతులైన ఉపాధ్యాయులంటే విద్యార్థులకు ఎల్లప్పుడు భక్తి ప్రపత్తులుంటాయి. ఉత్తమోపాధ్యాయులకు బ్రహ్మరథం పడతారు. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు మైసూరు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నపుడు 1921 లో-కలకత్తా విశ్వవిద్యాలయం వారు వారిని తమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పనిచేయవలసిందిగా అభ్యర్థించారు.వారి కోరికను మన్నించి రాధాకృష్ణ పండితుడు కలకత్తాకు బయలుదేరాడు. వారు ఇంటి నుండి రైల్వేస్టేషన్ కు గుఱ్ఱపు బగ్గీలో వెళుతుంటే ప్రజలు పెద్ద ఊరేగింపుగా వచ్చారు. విద్యార్థులు బగ్గీకున్న గుఱ్ఱాలను విప్పదీసి ఇంటినుండి స్టేషన్ దాకా అభిమానంతో, ఆత్మీయతతో స్వయంగా వారే బగ్గీని లాగారు. ఆయన ఎక్కిన రైలు పెట్టెను ఒక దేవాలయం లాగా అలంకరించారు.

గురువు విద్యార్థుల మనస్సులను నేర్పుతో విశ్లేషించగలగాలి. అందుకు విద్యార్థులతో ప్రేమతోను, స్నేహంతోను మెలగాలి. ఒక విధంగా చెప్పాలంటే గురువు విద్యార్థిలోకి పరకాయ ప్రవేశం-చేయాలి. అందులకు ఎంతో సహనం కావాలి. విద్యార్థుల తప్పిదాలను గ్రహించి సరిజేయ గలిగే ఓర్పు ఉండాలి. రాధాకృష్ణ పండితునకే సంబంధించిన మరో సంఘటన ఇట మనం చెప్పుకుందాం. ఒకసారి రష్యా అధినేత స్టాలిన్ రాధాకృష్ణుని తనదేశానికి ఆహ్వానించాడు. అప్పటికే స్టాలిన్ క్రూరునిగా ముద్రపడ్డాడు. ఒక భారతీయ తత్త్వవేత్తను స్టాలిన్ వంటివాడు పిలవటంతో ప్రపంచం నివ్వెరపోయింది. రాధాకృష్ణుడు స్టాలిన్ ఆహ్వానాన్ని మన్నించి రష్యా వెళ్లాడు. రాధాకృష్ణునితో సమావేశమైన స్టాలిన్ చివరగా పండితునితో "నన్ను-మనిషిగా మీరొక్కరు మాత్రమే గుర్తించా"రని అన్నాడు. ఇంత లోతైన మానసిక విశ్లేషణ గురువునకవసరం. రాధాకృష్ణపండితుడు 'సహనమే సంస్కృతి' అని చెప్పటం స్వానుభవమే.

# సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలి -కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ జర్నలిస్టుల ఫెడరేషన్ డిమాండ్

దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ జే ఎఫ్ఐ) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కేరళలోని తిరవనంతపురంలో జరిగిన మూడు రోజుల సీనియర్ జర్నలిస్టుల జాతీయ సమావేశాల్లో సీనియర్ జర్నలిస్టుల సమస్యలపై చర్చించిన తర్వాత పలు తీర్మానాలను ఆమోదించారు-.ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల సీనియర్ జర్నలిస్టులతో ఏర్పడిన "సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా"(ఎస్ జే ఎఫ్ఐ) తీర్మానాలు చేసి ఆమోదించడం జరిగింది. దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టుల పరిస్థితి దుర్బలంగా, అనిశ్చితంగా ఉందని, చాలా రాష్ట్రాల్లో,జర్నలిజం వృత్తి నుంచి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులు వివిధ అనారోగ్యాలు, కుటుంబ ఆర్థిక భారాలు,ఒంటరితనం వంటి అనేక సమస్యల మధ్య తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. సరైన ఆదాయం లేకపోవడంతో ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడం సవాలుగా మారిందని, చాలా మంది విషయంలో స్వీయ,జీవిత భాగస్వామి వైద్య ఖర్చులు భరించలేనంత ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ తీవ్రమైన పరిస్థితిని చాలా అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని, అందువల్ల సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ మొదటి జాతీయ సమావేశం దేశవ్యాప్తంగా అర్హత కలిగిన సీనియర్ జర్నలిస్టులందరినీ కవర్ చేసే జాతీయ పెన్షన్ పథకాన్ని అత్యవసరంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ప్రస్తుత తరం సీనియర్ జర్నలిస్టులు ఎటువంటి నిర్దిష్ట ఆదాయాన్ని సంపాదించనందున, పెన్షన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలని, భారత ప్రభుత్వం ప్రకటనల ద్వారా మీడియా సంస్థలకు భారీగా మద్దతు ఇస్తుందని,ప్రకటన చెల్లింపులో నిర్దిష్ట శాతాన్ని సంక్షేమ పథకానికి కేటాయించవచ్చని సమావేశం సూచించింది. వృత్తి నుండి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు ప్రతిపాదిత జాతీయ పెన్షన్ పథకాన్ని దోహదపడేలా ప్రభుత్వం జర్నలిస్టు సంఘాలతో సంప్రదింపులు జరపాలని, సీనియర్ జర్నలిస్టులు నిర్ణయించి కోరితే తప్ప, ప్రతిపాదిత జాతీయ పెన్షన్ పథకం వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం అమలులో ఉన్న పెన్షన్ పథకాలను అమలు చేయకూడదని సమావేశం అభిప్రాయపడింది. జాతీయ పెన్షన్ పథకంపై సంప్రదింపులు ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్ జే ఎఫ్ఐ, వివిధ వర్కింగ్ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది.

అదేవిధంగా సీనియర్ జర్నలిస్టుల వైద్య ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకొని వీరిని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ ఎస్)లో చేర్చాలని సమావేశం డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు ఇతర విభాగాల వారికి ఇస్తున్న సబ్సిడీ ఆరోగ్య బీమా పథకంలో సీనియర్ జర్నలిస్టులను చేర్చాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టులు చాలా కాలంగా రైళ్లలో పొందుతున్న రాయితీ ప్రయాణ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం 2020లో తొలగించిందని, దీని వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, రాయితీ ప్రయాణాన్ని వెంటనే పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేస్తూ తీర్మానించింది.

# బీహార్ జర్నలిస్టుల పెన్షన్ సొమ్ము పెంపు-తెలంగాణలో ఈ పథకం అమలు చేయాలి -టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్




బీహార్ లో జర్నలిస్టుల గౌరవ పెన్షన్ స్కీమ్ కింద అర్హులైన జర్నలిస్టులందరికీ 6,000 రూపాయలకు బదులుగా 15,000 రూపాయలు నెలవారీ పెన్షన్ అందించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా గౌరవ పెన్షన్ స్కీమ్ కింద పెన్షన్ పొందుతున్న జర్నలిస్టులు మరణిస్తే... వారి జీవిత భాగస్వామికి జీవితాంతం 3,000 రూపాయలకు బదులుగా ఇక నుంచి 10,000 రూపాయలు నెలవారీ పెన్షన్ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తారని, వారు ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభం అని, సామాజిక అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, అలాంటి జర్నలిస్టులకు తమ ప్రభుత్వం గౌరవ పెన్షన్ ఇవ్వడం సముచితమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ జర్నలిజంను నిష్పక్షికంగా నిర్వహించడానికి, పదవీ విరమణ తర్వాత గౌరవంగా జీవించడానికి మేము మొదటి నుంచీ జర్నలిస్టుల సౌకర్యాలను జాగ్రత్తగా చూసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో పెన్షన్ ఇవ్వాలి -టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలలో సీనియర్ జర్నలిస్టులకు గౌరవ పెన్షన్ పథకం అమలవుతుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రవేశపెట్టి అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన జర్నలిస్టులు వేతనాలు, ఇతర ఆదాయాలు లేక ఆర్థిక, ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు,ప్రభుత్వాలకు సేవలందించిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇచ్చి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలని ఇటీవల కేరళలో జరిగిన జాతీయస్థాయి సీనియర్ జర్నలిస్టుల మహాసభల్లో అన్ని రాష్ట్రాలు ముక్త కంఠంతో డిమాండ్ చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.

# గజేంద్ర మోక్షము

ఆచార్య డా. శనగవరపు కృష్ణ మూర్తి శాస్త్రి



మాయలో కొట్టు మిట్టాడు మాయ లోక
సృష్టి కర్త యెవరు? నట్టి ఈసుడ నను
కావు కావుమనుచు మత్త గజము వేడె
జగము మాయని తెలియని జడుడ నగుచు--62

గర్వ మంది చూపగ బూన్తి కండ బలము
వేద నదులు చేరు పయోధి వేద మూర్తి
యైన యార్తుల రక్షక యాదు కొనవె
త్యాగ మూర్తులైన మునులు ధ్యాన మెవరి--63

దర్శనమునకెపుడు తహ తహలు చెందు?
సర్వ భూత హితు డెవరు? సర్వ మెవరు?
యెవరు పరమాత్మ? నన్నాద నెవరు వచ్చు ?
ఏ విధమున దీనిని గెల్తు? నెవ్వ రాదు---64

కొనెడి వేల్పుని జింతింతు? కొల్తు నెవరి?
రక్షకుండేడి? నాదు మొరవినునెవరు?
నన్ను కాపాడు నట్టి పుణ్యాత్ము డెవరు ?
పుట్టి గిట్టుటల్ లేనట్టి పురుషు డెవరు ?—65

సృష్టి కర్తగ నెవ్వరై పుష్టి చేయు?
సాక్షిగా నెవ్వరై లోక రక్ష చేయు?
లయము నెవ్వరు సేయునో లాస్యమరయ ?
పరమ పావన మూర్తి కాపాడ రావె.—66

ఎవనిచే పుట్టు లోకంబు లెవని లోన
యుండి లీనమగు పరమేశుం డెవరగు
మూల కారణం బెవ్వడు మొదలు మధ్య
చివరలేవి లేక జగముల్జీవ యచర --67

రాశులన్నింటి కెవరుసర్వాత్మ యగుచు
నొప్పు చుండునో తనకు తానుగ సృజించు
కొనెడి పరమాత్మ నన్నాదు కొనుము దేవ
యనుచు నార్తిగ కరి వేడ్కొనంగ జొచ్చె --68

దీనుల యెడ యోగుల యెడ దిశల యందు
కలడు కలడందురుగ దేవ గలవ నీవు ?
లేడు లేడను మాటయే లెస్స యగున ?
కాదు కాదు దేవా యది కానె కాదు--69

కలడని యెడి వాదము నొప్పు కచ్చితముగ
కలిమి లేముల వ్యత్యాసములకు దూర
మెవరు? మొర లాలకించున దెవరు కలడు?
జన్మ కర్మలు లేనట్టి, జన్మ దోష--70

ములు కలగనట్టి యేకైక మూల ప్రకృతి
వగుచు, పరి పూర్ణ పురుషుడ వగుచు, నీవు
ప్రళయ సమయము నందు సర్వజగములను
లయము గావించి సృష్టించు లాస్య మూర్తి--71

జగములందు పెన్జీ కటి సంభవింప
జేయుచు తిరిగి వెలుగు నిచ్చెడివిభుండ
వైన జగదీశ్వరునికి నే ప్రణతు లిడుదు
మాయ లన్నిటిలో పెనుమాయ నీవు –72

భక్తుల యెడ చూపు దయ యపార మంద్రు
శత్రు భావన లేనట్టి సత్వ మూర్తి
సత్యమై నిత్యమై చను సత్య మూర్తి
వయ్య, దిగివచ్చి నన్నాద వయ్య ప్రభువ –73

(సశేషం )

# శ్రీకారం 2050....?

ఆచార్య కందాళం బదరీ కృష్ణకుమార్



(గత సంచిక తరువాయి)

"ఐదు సంవత్సరాల క్రితం కూడా, వీళ్లే అధికారంలో ఉండేవాళ్ళు. మళ్ళీ ఎలక్షన్లో గెలవడానికి ప్రజల్ని ఆకర్షించే విధంగా ఎన్నో ఉచిత పథకాలు ప్రవేశపెట్టారు. గ్యాస్, గ్రైండర్, మిక్సీ, సైకిల్ ఇవ్వటమే కాకుండా, ఉచితంగా ఇల్లు కట్టి ఇచ్చారు. వడ్రంగులకి, కంసాలులకీ, చేనేత కార్మికులకు, బెస్తా వాళ్ళకి, బొగ్గు గనుల్లో పనిచేసే వారికి, ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు, వడ్డీలేని రుణాలు ఇచ్చారు. రైతులకు ఇంతకు ముందున్న రుణాలు మాఫీ చేయడమే కాకుండా, వారికి భూములతో పాటు, తిరిగి ఇవ్వనవసరం లేని రుణాలు ఇచ్చారు. మైనారిటీలకు, ఎస్సీ ఎస్టీ వారికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి, మహిళలకి, భర్త చనిపోయిన వారికి, భర్త వదిలి పెట్టిన వాళ్లకి, అంగవైకల్యం కలిగినవారికి, వేలకొద్ది రూపాయలు నెల నెల వారి బ్యాంక్ అకౌంట్లో డబ్బులు వేసేవాళ్ళు. వృద్ధులకు పింఛన్ పథకం కింద నెల నెల డబ్బులు ఇచ్చేవారు.

ఇవన్నీ వినటానికి చాలా మంచి పథకాల కింద కనిపించినా, ఇది ప్రభుత్వానికి తలకు మించిన భారం అయ్యింది. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యింది. అందుకే, ఈరోజు ఈ పరిస్థితి”

"నీకు రాజకీయ పరిజ్ఞానం చాలానే ఉంది. సరే అన్నీ ఉచితంగా ఇస్తే ప్రజలు ఏం చేసేవారు" కుతూహలంగా అడిగాడు రామ్.

"అదే కదా సార్ సమస్య. సుఖం మరిగిన వాడు కష్టపడ లేడు, అన్నమాట నిజం చేస్తూ, అందరూ సోమరిపోతులుగా మారారు. ఒక్కడు పనిచేయటానికి సిద్ధంగా లేడు. ఎంతసేపు ఇళ్లల్లో కూర్చుని, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన టీవీ చూసుకుంటూ, మొబైల్ ఫోన్లో మాట్లాడుకుంటూ మద్యంతాగుతో, బయటకి రాక, సూర్యరశ్మి తగలక, రోగాల బారి పడ్డారు. ముప్పయి శాతం మంది పిచ్చి వారుగా మారారు. ఇప్పటికీ పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా, ఎవరూ పనిచేయటానికి సిద్ధంగా లేరు. ఈ ప్రభుత్వమే ప్రజలని పాడు చేసింది సార్. అప్పుడు ఈ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన కానుకలకి మురిసిపోయి, తిరిగి వాళ్ళనే అత్యధిక మెజారిటీతో గెలిపించారు, ఇప్పుడు అనుభవిస్తున్నారు. మళ్ళీ వీళ్ళ మాటలు నమ్మి గెలిపిస్తే, ఈ రాష్ట్రానికి పుట్టగతులు ఉండవు. అది ఈ ప్రజలకు ఎప్పుడు అర్థమవుతుందో తెలియటం లేదు సార్." ఆవేదనగా అన్నాడు డ్రైవర్.

"నువ్వు ఈ ఉచిత పథకాల గురించి చెప్తుంటే, నాకొక విషయం గుర్తుకు వస్తోంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఆ దేశం పేరు గుర్తులేదు గాని దానిని పరిపాలించిన రాజు దగ్గర చాలా ధనం ఉండేది. అతను తన ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో, అన్ని ఉచితంగా ఇవ్వటం మొదలెట్టాడు. ఎవరు పనిలోకి వెళ్ళటంగాని, చదువుకోవటం కానీ చేసేవారు కాదు. ఎంతసేపు ఇంట్లో కూర్చుని మద్యం సేవించడం, ఊరి మీద పడి తిరగటం చేసేవారు. కొన్నిసంవత్సరాలకి రాజుగారి ఖజానా ఖాళీ అయ్యింది. అయినా కూడా ప్రజల కష్ట పడకూడదని ఇతర దేశాల నుంచి అప్పులు చేసి, వారికి యధాతధంగా ఉచిత సౌకర్యాలు కల్పించేవాడు. అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి ఆ తరువాత, ఏ దేశం ఆ రాజుకి అప్పు ఇవ్వడానికి సిద్ధపడలేదు. ఏమీ చేయలేక ప్రజల దగ్గర పన్నులు వసూలు చేయడం

మొదలెట్టాడు. తమ దగ్గర రాజు గారు ఇచ్చిన డబ్బులు ఉన్నంత-వరకు ప్రజలు పన్నులు కట్టారు. ఆ తరువాత ఏం చేయాలో వారికి తెలియలేదు. వారికి చదువు రాదు, ఏ పని తెలియదు. పోనీ ఇతర దేశాల నుంచి మనుషుల-ను రప్పించుకొని అభివృద్ధి చే-సుకుందామని రాజు అనుకున్నా, ఏ దేశం నుంచి కూడా ఎవరూ రావటానికి సిద్ధపడలేదు. వ్య-వసాయం తెలియక భూములు బీడుభూములుగా మారాయి. రాజుగారు ఏమీ చేయలేక ని-స్సహాయంగా ఉండిపోయారు. ప్రజలు డబ్బుల్లేక ఒకరినొకరుదో-చుకోసాగారు. కొన్ని ఏళ్ళ తర్వాత ఆదేశం ఏమైందో కూడా తెలియ-కుండా పోయింది" తను ఎప్పుడో చదివిన విషయం గుర్తుకు తె-చ్చుకుంటూ చెప్పాడు రామ్.

"అచ్చంగా మన దేశ కథలానే ఉంది సార్"

"బడుగు వర్గాలు పైకి రాకూడదు అని కాదు వారికి ఉచితంగా ఇచ్చే బదులు జీవన ఉపాధి కల్పి-స్తే బాగుండేది" అంటూ రామ్ అలసటతో కార్లో సాగిలపడి కళ్ళు మూసుకున్నాడు.

..........

"సార్ చూడండి" డ్రైవర్ మాటలకి నిద్ర నుండి ఉలిక్కిపడి లేచాడు. ఒక ఐదు కిలోమీటర్ల దూరంలో కొన్ని లారీలు ఆగి ఉన్నాయి. లారీలో ఉన్న బియ్యం మూటలు తమ బండిలో ఎక్కించుకుంటూ చాలామంది మనుషులు కని-పించారు. వాళ్ళందరూ ముఖం కనిపించకుండా ముసుగులు వే-సుకున్నారు. డ్రైవర్ వెంటనే టాక్సీ వెనక్కి తిప్పి వేరే దారికి మళ్ళిం-చాడు.

"ఏం జరుగుతోంది?"

"దోపిడీ సార్. ప్రజలకి తిండి గింజలు కూడా దొరకటం లేదు. ఎందుకంటే అన్ని వస్తువు-లు ఇంపోర్ట్ అవుతున్నాయి తప్ప ఎక్స్పోర్ట్ అవటం లేదు. ఈ బియ్యం కూడా ఇంపోర్ట్ చేసు-కున్నవే. ఈ లారీలు ఎయిర్ పోర్ట్ నుంచి వస్తున్నాయి. దారిలో కాపు కాసి కొల్లగొడుతున్నారు. చెప్పాను కదా సార్, పనిచేయటానికి సోమ-రితనం, డబ్బు కావాలి, అందుకే చాలామంది ఈ దారి పట్టారు"

"మరీ డ్రైవర్ ప్రతిఘటిస్తున్నట్టు కనిపించలేదు. వాళ్లతో లాలూచీ పడ్డాడా"

"కాదు సార్ లారీ నడుపుతున్నది, మనిషి కాదు రోబో. ఇందాక ము-ఖ్యమంత్రి మీటింగ్ లో చెప్పినట్టు ప్రభుత్వం డ్రైవర్లను తీసివేసి ఈ రోబోలను పెట్టుకుంది"

"రోబోలకు వాటికి ఇచ్చిన పని చేయటం తప్ప మరో పని రాదు. అందుకే ప్రతిఘటించడం లేదు కాబోలు"

"ఆర్థికంగా స్థిరపడాలని రోబోలను పెట్టుకున్నారు, కానీ ఇదిగో ఈ విధంగా నష్టపోతు-న్నారు"

"ఇలా దోపిడీ చేస్తుంటే పోలీసులు పట్టించుకోరా?"

" జీతాలు ఇవ్వలేక పోలీసు బల-గాన్ని కూడా సగానికి సగం తగ్గిం-చేసారు. వారికి బదులుగా పోలీస్ శాఖలో కూడా రోబోలను పెట్టు-కున్నారు. వాటికి మీరన్నట్లు వేరే పని చాతకాదు. అవి ప్రభుత్వా-నికి పెద్ద తలనొప్పిగా తయార-య్యాయి. నేరస్తులను విచక్షణా జ్ఞానం లేకుండా చితక కొడుతు-న్నాయి. దానివల్ల చాలా మంది నేరస్తులు జైలులోనే చనిపోవ-టం జరుగుతోంది. ప్రభుత్వం ప్ర-తిపక్షాలకు, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక సతమతమవుతూ ఉంది. రోబోలను పెట్టుకోవడం వల్ల వారికి నష్టమే జరుగుతోం-ది కానీ లాభం కాదు. మల్టీ టాస్క్ చేయగల రోబోలు విదే-శాలలో ఉండవచ్చుగాని, ఇక్కడ ఇప్పుడు, మన వాళ్ళు వాడుతు-న్న రోబోల వల్ల పెద్ద ప్రయోజనం లేదు. ఇప్పుడున్న పోలీసులకి నాయకులకి కాపలా కాయటాని-కే సమయం సరిపోవడం లేదు. ఇంక, దొంగలని ఏం పట్టుకుం-టారు. బలమున్నవాడిదే రాజ్యం అన్నట్లు ప్రభుత్వం కూడా ఈ వి-షయాన్ని పెద్దగా పట్టించుకోవ-టం లేదు"

"మరి సామాన్య ప్రజలకు తిండి ఎలా వస్తోంది ?"

"అది ప్రభుత్వమే భరిస్తోంది సార్. వారానికి ఒకసారి ఇంట్లో ఉన్న మనుషులకి, ఒక్కొక్కరి-కి ఇన్ని గ్రాములు చొప్పున లెక్క కట్టి, వారానికి సరిపడా బియ్యం, రెండు రకాల కూరగాయలు మాత్రం, రేషన్ గా ఇస్తున్నారు. ప్రజలు వాటితోనే సరిపెట్టుకుం-టున్నారు"

(సశేషం )

# మధుర స్వప్నం

(గత సంచిక తరువాయి)



ఉషారాం

నా తప్పుకాయండి అన్నాడు. అప్పుడు అమ్మమ్మ గారు తను పెట్లో ఉన్న రెండు చీరలు తెచ్చిస్తూ ఒరేయ్ అబ్బి అడిగి తీసుకోవాలి కానీ ఇలాంటి పనులు ఎప్పుడు చేయకు అన్నం తిన్నారా ఇద్దరూను అని వాళ్ళకు అన్నం పెట్టి రంగయ్యకు వంద రూపాయలు ఇచ్చి ఒరేయ్ ఇది మా అన్నయ్య గారు పెట్టిన చీర అందుకని జాగ్రత్తగా కట్టుకుంటున్నాను అంతే. ఆ దొంగ అమ్మమ్మ గారికి నమస్కారం చేసి కళ్ళనీళ్ళతో క్షమించండి అమ్మ అంటూ పదేపదే చెప్పాడు, ఆ సంఘటన చూశాక తనకి చాలా ఆశ్చర్యం వేసింది. వసుధకు తన స్నేహితురాలు

గౌతమి చెప్పిన ఒక విషయం గుర్తొచ్చింది గౌతమి విద్యుత్ కార్యాలయంలో బిల్లులు కట్టుకునే పని చేస్తూ ఉండేది. ఒకసారి పొరపాటుగా ఒక బిల్లుకి డబ్బు ఇవ్వడంలో 900 రూపాయలు ఎక్కువ ఇచ్చేసింది. తను చూసుకోలేదు. కౌంటర్ చాలా రద్దీగా ఉంది.

ఒకతను బిల్లు కట్టాక కూడా తనని పిలుస్తుంటే వినుక్కుంది. కానీ అతను వెళ్ళిపోకుండా కౌంటర్ టైం అయిపోయాక మేడం గారు అంటూ మళ్ళీ పిలిచి మీరు ఇందాక చూసుకోకుండా నాకు డబ్బులు ఎక్కువ ఇచ్చారండి అవి ఇవ్వడం కోసమే మిమ్మల్ని ఇందాకటినుంచి పిలుస్తున్నాను. మీరు లెక్క చూసుకుంటే మొత్తం డబ్బు తేడా వస్తుంది కదా అన్నాడు .తను అతని ఫోన్ నెంబర్ తీసుకుని చాలా థాంక్స్ అండి అని చెప్పింది. ఫర్వాలేదండి అంటూ వెళ్లిపోయాడు. ఏడో తారీఖు నుంచి కౌంటర్ దగ్గర అలాగే రద్దీగా ఉంటుంది. ఇంకో కౌంటర్ ఏర్పాటు చేయడానికి కార్యాలయం వాళ్ళు ఒప్పుకోరు. జనం ఆగరు ఒక్కొక్క రోజు రాత్రి 8 కూడా అయిపోతుంది. డబ్బు తక్కువ వస్తే తను వేసుకోవాల్సిందే. నిజాయితీపరులు కొందరైనా ఉన్నారు కాబట్టి కొంచెమైనా వానలు పడుతున్నాయని అనుకుంటూ గౌతమి చెప్పింది. రంగయ్య లాంటి ఉత్తములైన పనివాళ్ళు ఉండడం అమ్మమ్మ గారి అదృష్టం అనుకుంది.

(సశేషం)

---

## క్రాంతివీరుడు (పండిత్ శ్యామ్ జీ కృష్ణవర్మ) (26 వ పేజీ తరువాయి)

మాతృభూమి సేవలకై
వెచ్చించగ దలచుకొనెను
గట్టి నిర్ణయమ్ము గొనెను

### నాలుగవకొమ్మ

స్వామి దయానంద సర
స్వతి అనుమోదము పొందెను
వెను వెంటనె బయలుదేరి
లండను నగరము చేరెను

శతాబ్దాల తరబడిగా
పేరుగొన్న పెనుసత్రము
లండను ఇన్నర్ టెంపుల్
సముదాయమునందుండెను

లండను న్యాయస్థానము
ఏర్పరచిన సత్రము అది
ఇతర దేశ న్యాయవాదు
లచట విడిదియై యుందురు

లండనులో ఇటువంటివి
నాలుగు సత్రములున్నవి
శయనభోజనాది వసతి
సౌకర్యమ్ములు గలవి యవ్వి

న్యాయశాస్త్ర మభ్యసించు
విద్యార్థులు చేరుదురట
న్యాయ శాస్త్ర శిక్షణకై
న్యాయవాదులుండెదరట


జపాన్ లో
ప్రధాని


Sri Viswashanti Maha Shakti Ganapathi 2025
శ్రీ విశ్వశాంతి మహా శక్తి గణపతి 2025
ఖైరతాబాద్
గణేశుడు
71
YEARS
69 Feet Clay Ganesh
Sri laxmi Sameta Haiyagreeva Swamy
Sri jagannatha swamy
Sri lalita Tripurasundari
Sri Gajjalamma

RNI No. TELTEL/2011/39497 SEPTEMBER 2025 POSTAL NO. HSE/1043/2017-1
Date of Publication:1st September Date of Posting:8th September




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana
Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com ,
www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-50000